


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 88 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఎన్.టి.ఆర్ జిల్లా శనివారం 11 ఏప్రిల్ 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 88 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : NTR DIST, SAT 11 APRIL 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur

# పీఎన్జీ కనెక్షన్లు వేగవంతం చేయండి..

## రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై సీఎం చంద్రబాబు సమీక్ష

- రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- పీఎన్జీ వినియోగాన్ని పెంచాలని, 6 నెలల్లో 10 లక్షల కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యం
- దీపం లబ్ధిదారులు పీఎన్జీకి మారినా రాయితీ కొనసాగించాలని నిర్ణయం
- శ్రీకాకుళం-కాకినాడ పైప్‌లైన్ పనుల జాప్యంపై కేంద్ర మంత్రికి సీఎం ఫోన్
- యుద్ధాల నేపథ్యంలో ఎల్పీజీ కొరత రాకుండా ప్రత్యామ్నాయ చర్యలకు ఆదేశం



**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలో గ్యాస్ సరఫరా, పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్ల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అంతర్జాతీయంగా యుద్ధాల కారణంగా ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో తలెత్తుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు పూర్తి సన్నద్ధతతో పనిచేయాలని అధికారులను, ఆయిల్ కంపెనీల ప్రతినిధులను ఆయన ఆదేశించారు. ప్రత్యామ్నాయంగా పీఎన్జీ వినియోగాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. వచ్చే 6 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల కొత్త పీఎన్జీ కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ విషయంలో ఎలాంటి జాప్యం జరగకూడదని, నిర్దేశిత లక్ష్యాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ చేరుకోవాలని తేల్చిచెప్పారు. ఈ సమీక్షలో భాగంగా 'దీపం' పథకం లబ్ధిదారులను పీఎన్జీ వైపు ప్రోత్సహించడంపై సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. దీపం లబ్ధిదారులు పీఎన్జీ కనెక్షన్‌కు మారితే, వారికి పథకం కింద అందే రాయితీ

మిగతా 2లో

## మంత్రులకు చంద్రబాబు సీరియస్ వార్నింగ్..

### ఇంకో సారి రిపీట్ కాకూడదంటూ హెచ్చరిక

- మూడు గంటల పాటు కొనసాగిన కేబినెట్ సమావేశం
- సమావేశానంతరం మంత్రులతో చంద్రబాబు ప్రత్యేక భేటీ
- ప్రభుత్వ సమాచారం లీక్ అవుతుండటంపై సీఎం సీరియస్
- మరోసారి రిపీట్ అయితే మంత్రులను బాధ్యులను చేస్తానంటూ వార్నింగ్
- గతంలో ఇలాంటి లీకుల వల్లే కేబినెట్‌ను ఎన్టీఆర్ రద్దు చేశారని గుర్తు చేసిన వైనం

మిగతా 2లో



### నవ రాయ్‌పూర్‌ను ఉదాహరణగా చూపుతూ

## అమరావతిపై సజ్జల విమర్శలు

- అమరావతిలో సామాన్య ప్రజలు నివసించే పరిస్థితి లేదన్న సజ్జల
- అమరావతిని అవినీతికి తరగని గనిలా చంద్రబాబు వాడుకుంటున్నారని ఆరోపణ
- ఆకాశహర్మ్యాలు కట్టడం వల్ల రాష్ట్రానికి ఆదాయం ఎలా వస్తుందో చెప్పలేకపోతున్నారని విమర్శ

**పెన్ పవర్ డెస్క్:**ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్మిస్తున్న అమరావతి రాజధాని 40 ఏళ్లయినా పూర్తికాదని, అదొక అసాధ్యమైన ఆలోచన అని వైసీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని నవ రాయ్‌పూర్‌ను ఉదాహరణగా చూపుతూ, అక్కడ కేవలం భవనాలు మాత్రమే ఉన్నాయి తప్ప జనం లేరని, అమరావతి

మిగతా 2లో





## నమాజ్ కోసం ఉగ్రవాదులపై దాడిని వాయిదా వేశాం..

### ఆపరేషన్ సిందూర్ రహస్యాలు వెల్లడించిన ఆర్మీ చీఫ్

- ఉగ్రవాద శిబిరంపై దాడిని నమాజ్ కోసం వాయిదా వేసిన సైన్యం
- 'అందరి దేవుడు ఒక్కడే' అనే భావనతోనే ఈ నిర్ణయమన్న ఆర్మీ చీఫ్
- సైన్యంలో మహిళల చేరికపై కుమార్తెల సలహాలు తీసుకుంటానన్న జనరల్ ద్వివేది
- మార్కుల కన్నా వ్యక్తిత్వం, పరిస్థితులకు అనుగుణంగా మారడమే ముఖ్యం

మిగతా 2లో



## ట్రెండ్ ను ఫాలో కావొద్దు... సవాళ్లను స్వీకరించండి

### బెంగళూరులో నారా లోకేశ్

- బెంగళూరు గ్రీన్‌వుడ్ హై స్కూల్ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో మంత్రి లోకేశ్
- సవాళ్లను స్వీకరించి లక్ష్యంపై దృష్టి పెట్టాలని యువతకు సూచన
- షార్ట్ కట్ల ప్రపంచంలో నైతికతే గొప్ప బలమని ఉద్బోధ
- ఏపీ, విశాఖ అభివృద్ధిలో సత్వా గ్రూప్ భాగస్వామి కానుందని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**యువత సవాళ్లను స్వీకరించి ముందుకు సాగాలని, ట్రెండ్‌ను అనుసరించకుండా నిర్దిష్ట లక్ష్యంపై దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. బెంగళూరులోని సర్జాపూర్‌లో ఉన్న గ్రీన్‌వుడ్ హై ఇంటర్నేషనల్ స్కూల్ ఐబీడీపీ (గ్రేడ్-12) 2026 గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన

మిగతా 2లో



## పులివెందులకు 'అవి గొడ్డలి' అని పేరు పెట్టండి

- అమరావతికి 'మావిగన్' పేరుపై జగన్‌ను ఎగతాళి చేసిన షర్మిల
- అవినాశ్ రెడ్డి పేరు మీద పులివెందులకు 'ఆవి గొడ్డలి' అని పేరు పెట్టాలంటూ వ్యంగ్యం
- గన్నులు, గొడ్డళ్లే వైసీపీ సిద్ధాంతమా అని తీవ్ర విమర్శ
- ఐదేళ్లలో రాజధానికి ఇటుక కూడా పెట్టలేదని ఆరోపణ
- 'మావిగన్' ఆలోచన ఒక జోక్ అని కొట్టిపారేసిన షర్మిల

మిగతా 2లో



### భాగ్యనగరంలో 'ప్రేమ' ముసుగులో

## మతం మార్పిడి దందా

### అన్నదమ్ముల ఘాతుకం వెలుగులోకి

**పెన్ పవర్ డెస్క్:**హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో హిందూ యువతులను లక్ష్యంగా చేసుకుని సాగు తున్న ఒక దారుణమైన

మిగతా 2లో

### భోగాపురం విమానాశ్రయం

## ప్రారంభోత్సవానికి మోదీకి ఆహ్వానం!



- తుది దశకు చేరుకున్న భోగాపురం విమానాశ్రయం పనులు
- మోదీకి నాలుగు తేదీలను సూచించిన ఏపీ ప్రభుత్వం
- ఈ విమానాశ్రయంతో మారిపోనున్న ఉత్తరాంధ్ర రూపురేఖలు

మిగతా 2లో



## యూపీలో పడవ బోల్తా... 10 మంది మృతి...

### ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

- మధురలోని యమునా నదిలో పడవ బోల్తా
- ప్రమాదంలో 10 మంది యాత్రికులు మృతి
- 14 మందిని కాపాడిన సహాయక బృందాలు
- గల్లంతైన వారి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు
- ప్రమాదంపై ప్రధాని, యూపీ సీఎం దిగ్భ్రాంతి

**పెన్ పవర్ డెస్క్:**ఉత్తరప్రదేశ్‌లోని మధుర జిల్లాలో ఘోర పడవ ప్రమాదం జరిగింది. బృందావన్‌లోని కేశీఘాట్ వద్ద యమునా నదిలో యాత్రికులతో వెళుతున్న పడవ బోల్తా పడటంతో 10 మంది మృతి చెందారు. మరో 14 మందిని సహాయక బృందాలు సురక్షితంగా కాపాడాయి. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. వివరాల్లోకి వెళితే, పంజాబ్‌కు చెందిన సుమారు 30 మంది యాత్రికులు శుక్రవారం మధ్యాహ్నం పడవలో యమునా నదిలో ప్రయాణిస్తున్నారు.

మిగతా 2లో

## లొంగిపోయిన 42 మంది మావోయిస్టులు.. కీలక వ్యాఖ్యలు చేసిన తెలంగాణ డీజీపీ

- లొంగిపోయిన వారిలో బెటాలియన్ డిప్యూటీ కమాండర్ స్థాయి నేత కేశాలు
- ఏడాదిన్నర కాలంలో 763 మంది మావోయిస్టులు లొంగిపోయారన్న డీజీపీ
- తెలంగాణలో నలుగురు మావోయిస్టులు మాత్రమే మిగిలిపోయారని వెల్లడి
- వారు కూడా లొంగిపోవాలని పిలుపు

**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణలో మావోయిస్టుల కార్యకలాపాలు క్రమంగా తగ్గుముఖం పడుతుండగా, తాజాగా భారీ సంఖ్యలో మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో మొత్తం 42 మంది మావోయిస్టులు తమ ఆయుధాలను వదిలి జనజీవన స్రవంతిలోకి చేరారు. లొంగిపోయిన వారిలో బెటాలియన్ డిప్యూటీ కమాండర్ స్థాయి కలిగిన కేశాలు

మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

## ఏకధ్రువ ప్రపంచానికి చెక్ పెట్టినట్లేనా!

ప్రతిమనిషి పుట్టుకతోనే జీవించే హక్కుతో భూమిమీదకు వస్తాడు. మరణం అనేది ఆ హక్కుకు దూరం కావడమే! సాధారణ మరణం సహజ ప్రక్రియ. యుద్ధ మరణం అనేది ఉన్మాద చర్యతో జీవించే హక్కును అర్థాంతరంగా తుంచివేయడం. అందుకే ఏరకమైన యుద్ధమైనా వినాశ హేతువే? యుద్ధం ఒక పీడకచర్య. యుద్ధ మరణాలకు హేతుబద్ధత ఉండదు. మధ్యయుగాలలో యుద్ధమంటే వీరత్వానికి ప్రతీక. అటు తర్వాత ఆయుధం ప్రధానపాత్ర వహించింది. అధికారానికి ఆయుధం ప్రాకారంగా నిలిచింది. సాంకేతికత అభివృద్ధి చెందిన ఈ దశలో ఆయుధానిదే పైచేయి అయింది. ఇప్పుడు యుద్ధ వ్యూహాల్లో మార్పులొచ్చాయి. ఒకప్పుడు రష్యా, అమెరికా ప్రచ్ఛన్న యుద్ధస్థితి నుంచి, రష్యా అంతర్గత రాజకీయ మార్పుల తర్వాత అమెరికా ఏకధృవ ప్రపంచంగా ఎదిగింది. అంతేకాదు, తమ భూభాగంలో కాకుండా ప్రపంచం మొత్తం యుద్ధ స్థావరాలు ఏర్పరచుకొని, సైన్యాన్ని మోహరించి ప్రపంచ పోలీసుగా పెత్తనం చేస్తోంది. జనరల్ గడాఫీ, అలెండీ, సద్దాం హుస్సేన్ లాంటి ఎందరో దేశాధినేతలను హత్య చేయడంతో పాటు, ఆసియా, అమెరికా, ఆఫ్రికా ఖండాల్లో అనేక దేశాలతో యుద్ధాలు చేసింది. చివరకు తమ వ్యాపార సామ్రాజ్యానికి పోటీరాకుండా జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి నగరాలపై అణుబాంబులు వేసి సాముహిక మానవహననానికి అమెరికా పాల్పడింది. వియత్నాంతో పదహారేళ్ల సుదీర్ఘ యుద్ధం తర్వాత అమెరికా దూకుడుకు కళ్లెం పడింది.

ఇప్పుడు ఇరాన్‌తో భూతల యుద్ధంతో తలపడడం అంటే చావునోట్లో తలపెట్టడమేనన్న వ్యవహారం అర్థమైన తర్వాత ఇంటా, బయట ఏకాకిగా మారిన ట్రంప్, వ్యూహం మార్చి ఇరాన్‌తో సీజ్ ఫైర్‌కు తాపత్రయ పడ్డాడు. వ్యూహాత్మకంగా ఊపిరి పీల్చుకోవడానికి ఇరాన్ కూడా పది షరతులతో సిద్ధమైంది. సీజ్‌ఫైర్ అనబడే ఒప్పందం అనేది ఇటీవల కాలంలో ముందుకొచ్చిన దౌత్య ప్రక్రియనే. ఒకప్పుడు గ్రూపుల మధ్య ఒప్పందం ఇప్పుడు దేశాల మధ్యకు మారింది. భారత్-పాకిస్తాన్, ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధాలలో ట్రంప్ ముందుకు తెచ్చిన ప్రక్రియనే ఇది. కొత్తదేం కాదు, కాకుంటే ఓటమి అంచుల్లో పరువు దక్కించుకునే ఏకైక సూచిక! ట్రంప్ రెండువారాల యుద్ధ వెసులుబాటుకు ప్రయత్నమే ఆయనలో నెలకొన్న ఓటమి భయానికి నిదర్శనం. ఇరాన్‌లో 240మంది మహిళలు, 212 మంది పిల్లలు వెరసి 2076 మంది ప్రజలు యుద్ధంలో మరణించారు, 26,500 ప్రజలు గాయపడ్డారు. మిత్రదేశం లెబనాన్‌లో మరో 13వందల మంది ప్రజలను ఇజ్రాయిల్ చంపేసింది. అంతేకాదు, యుద్ధ ప్రారంభంలోనే ఇజ్రాయిల్, అమెరికా కుట్రపూరితంగా ఇరాన్ సుప్రీం లీడర్ అయుతుల్లా ఖొమైనీని అంతం చేసింది. అయినా ఇరాన్ తమ మౌలిక వనరుల రక్షణ దృష్టితో సీజ్‌ఫైర్‌కు అంగీకరించింది.

సుదీర్ఘ కాలం తమవెంట ఉన్న పశ్చిమ యూరప్ దేశాల యుద్ధ కూటమి "నార్త్ అట్లాంటిక్ ట్రిటీ ఆర్గనైజేషన్' నాటోలోని 30 దేశాలు ఇరాన్‌పై ట్రంప్ దాడికి మద్దతివ్వలేదు. సరికదా కొన్ని దేశాలు నేరుగా ఇరాన్‌కు మద్దతు తెలిపాయి. ఇక ప్రపంచ దేశాల ప్రజలతో పాటు, తనదేశంలో ప్రజలు నిరసన పతాకస్థాయికి చేరడంతో ట్రంప్ ఓ అడుగు సీజ్‌ఫైర్ పేరుతో వెనక్కి తగ్గాడు తప్ప, తనలోని యుద్ధ పిపాసి ఇంకా చావలేదు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత పిచ్చోడి చేతిలో రాయిలా ప్రపంచ దేశాలపై టారిఫ్‌ల పేరుతో విరుచుకుపడ్డాడు. గాజా విషయంలో ఇజ్రాయిల్ అమానుష కాండకు పరోక్షంగా మద్దతిచ్చాడు. పనామా అధ్యక్షుడు నోరిగోను మాదకద్రవ్యాల పేరుతో జైలు శిక్ష వేసి నిర్బందించాడు."ఆపరేషన్ అబ్జార్వేట్ రిజర్వ్" పేరుతో ప్రజలచేత ఎన్నికైన వెనెజులా అధ్యక్షుడు మదురో, ఆయన భార్య సిలియాలను అర్థరాత్రి ఇంటినుంచి కిడ్నాప్ చేసి అమెరికా జైలులో నిర్బంధించాడు.కేవలం ఆయిల్‌పై నియంత్రణ కోసం ఒకదేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నార్థకం చేయడమే కాక, తన పదవీ కాలం ముగిసిన తర్వాత వెనెజులాలో ఎన్నికలని కుళ్లు జోకులు వేస్తున్నాడు. పక్క రాష్ట్రం మెక్సికోతో ఘర్షణ, చిన్నదీవి లాంటి దేశం క్యూబాపై మానవత్వం మరచి ఆంక్షలు పెట్టడంతో పాటు, ఇరాన్ యుద్ధం తర్వాత క్యూబా అంతు చూస్తానంటున్నాడు. మరోవైపు పక్క దేశం కెనడాను తమదేశంలో అంతర్భాగం రాష్ట్రంగా కలుపుకుంటామని అవాకులు చవాకులు పలుకుతున్నాడు. నాటోలో అంతర్భాగమైన డెన్మార్క్‌కు చెందిన గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని ప్రకటించి నాటో కూటమి దేశాల్లో తమ పరపతి కోల్పోయాడు.

ఆఫ్ఘనిస్తాన్‌లోని కాందహార్ విమానాశ్రయం కావాలని పట్టుబడుతున్నాడు. ఇవన్నీ ట్రంప్ ఆయా దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవించకుండా వేస్తున్న చిల్లర వేషాలు తప్ప మరొకటి కాదు. మరో ముఖ్యమైన విషయం. ఎప్‌స్టీన్ ఫైల్స్ నుండి బయటపడడం కోసం, అత్యంత పెద్దదైన ఆసియా ఖండంలో పట్టుకోసం మరో యుద్ధోన్మాద దేశం ఇజ్రాయిల్‌తో కలిసి కుట్రపన్నాడు! ఇరాన్‌ను ఓడిస్తే తనకు ప్రపంచంలో తిరుగుండదని, యుద్ధ ప్రారంభంలోనే ఖొమైనీ లాంటి ఆయువుపట్టును లేపేస్తే, తాను వెనెజులా దేశంలా ఇరాన్‌ను కబళించి ఆధిపత్యం చెలాయించాలని చేసిన ప్రయోగం బెడిసికొట్టింది. నలభై రోజులుగా యుద్ధంలో ఇరాన్ అటు ఇజ్రాయిల్‌తో పోరాడుతూనే, అమెరికా అవకాశ ఆధిపత్యాన్ని వ్యూహాన్ని సవాల్ చేసి నిలబడింది. ఇరానియన్ రిపబ్లిక్ గార్డుల ధైర్య సాహసాలముందు అమెరికా తలవంచక తప్పలేదు. అగ్రరాజ్య ఆధునిక యుద్ధ విమానాలను కూల్చివేయడంతో ట్రంప్ దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. అంతర్గత సంక్షోభం, అధికార మార్పిడి లాంటి మాటలు ఇరాన్‌లో తుత్తునీయలు కావడం, ప్రపంచ పాలక వర్గాలు ఎలావున్నా ప్రజలు మద్దతు ఇరాన్‌కు అను కూలంగా ఉండడం, ఇరాన్ కూడా భౌగోళిక యుద్ధ తంత్రం హార్మూజ్ జలసంది మూసివేత, గల్ఫ్‌లో ఉన్న సౌదీ అరేబియా తదితర దేశాల్లో అమెరికా సైనిక శిబిరాలు, ఆయా దేశాల సాంకేతిక, ఆర్థిక వనరులపై వ్యూహాత్మకంగా దాడులు జరపడం ద్వారా అమెరికాకు వణుకు పుట్టించిందని చెప్పవచ్చు. ఇజ్రాయిల్ కోసం అమెరికా ఇరాన్‌పై దండయాత్రకు దిగింది. తమకు అమెరికా ప్రజలతో ఎలాంటి శత్రుత్వం లేదని ఇరాన్ ప్రకటించడం ఆ దేశ కుయుక్తిని ఎండగట్టింది. అమెరికా ఇరాన్ యుద్ధంలో ఒంటరై ఏకధృవ ప్రపంచం ఏవగింపునకు గురైంది. ఈ దశలో సీజ్‌ఫైర్ రెండు వారాల తర్వాత శాశ్వత ఒప్పందం జరుగుతుందా? యూటర్న్ తీసుకుంటుందా? ఈ విషయం నిర్ధారించే పరిస్థితి లేదు. ఎందుకంటే ఒప్పందం జరిగింది అమెరికా-ఇరాన్ మధ్య కనుక తాము యుద్ధం ఆపేది లేదని ఇజ్రాయిల్ తన యుద్ధ దాహం తీరక లెబనాన్‌పై బాంబుల వర్షం కురిపిస్తోంది. అందుకు ప్రతిగా ఇరాన్ సైతం గల్ఫ్‌లో ఇజ్రాయిల్, అమెరికా అనుకూల దేశాలపై దాడులు చేస్తోంది. అమెరికా-ఇరాన్ యుద్ధం ద్వారా రష్యా ఒకింత ఆయిల్ వ్యాపార రిత్యా, ఉక్రెయిన్ వైపు అమెరికా ఆయుధ సంపత్తి అందకుండా చేయడంలో సఫలమైంది. చైనా, ఉత్తరకొరియా, రష్యా దేశాలు ఇరాన్‌కు అందించిన సాంకేతిక, ఆయుధ మద్దతు ఆ దేశం నిలబడడానికి చాలా తోడ్పాటునందించింది. హార్మూజ్ జలసంది విషయంలో చైనా, రష్యా, ఫ్రాన్స్ ఐక్యరాజ్యసమితిలో తమ వీటో అధికారంతో ఇరాన్‌కు మద్దతు పలకడం అమెరికా ఏకఛత్రాధిపత్యానికి ఒక రకంగా చెక్ పెట్టినట్లే!

## పులివెందులకు 'అవి గొడ్డలి' అని పేరు పెట్టండి

ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, తన సోదరుడు, వైసీపీ అధినేత జగన్ పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఏపీ రాజధానికి 'మావిగన్' అని పేరు పెట్టాలన్న జగన్ ప్రతిపాదనను ఆమె తీవ్రంగా ఎగతాళి చేశారు దీనికి కౌంటర్‌గా, పులివెందుల నియోజకవర్గానికి 'అవి గొడ్డలి' అని పేరు మార్చాలంటూ సంచలన సెటైర్ వేశారు. ఈ వ్యాఖ్యలు ఏపీ రాజకీయాల్లో పెను దుమారం రేపాయి.జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' ఆలోచనను పూర్తిగా అపహాస్యం చేసిన షర్మిల, వైసీపీ సిద్ధాంతంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. "ఎంతసేపు గన్నులు, గొడ్డళ్లేనా? నరకాలి, చంపాలి, నాశనం చేయాలనే ఆలోచిస్తారా?" అని ఆమె ప్రశ్నించారు. జగన్ పేరులో 'గన్' ఉందని, వైఎస్ అవినాశ్ రెడ్డి పేరులో 'వినాశనం' ఉందని, వారి ఆలోచనా విధానం కూడా హింస చుట్టూనే తిరుగుతుందని ఆమె ఆరోపించారు. వివేకా హత్య కేసును పరోక్షంగా ప్రస్తావిస్తూ, "అమరావతికి మీ పేరు మీద 'మావిగన్' అని పెడితే, పులివెందులకు అవినాష్ రెడ్డి పేరు మీద 'అవి గొడ్డలి' అని పెట్టాలి" అని ఎద్దేవా చేశారు.గత ఐదేళ్ల పాలనలో జగన్ రాజధాని అమరావతి కోసం ఒక్క ఇటుక కూడా పెట్టలేదని షర్మిల విమర్శించారు. అధికారంలోకి రాగానే ప్రజావేదికను కూల్చివేయడంతోనే పాలన మొదలుపెట్టారని గుర్తుచేశారు. "ఇప్పుడు అమరావతి వద్దు, మావిగన్ పెడతారట. ఈ ఐడియా అంత అద్భుతంగా ఉంటే, ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు అమలు చేయలేదు?" అని ఆమె నిలదీశారు. 'మావిగన్'కు ఖర్చు తక్కువైతే, మరి మూడు రాజధానుల ప్రతిపాదన ఎందుకు తెరపైకి తెచ్చారని ప్రశ్నించారు.జగన్ 'మావిగన్' ప్రతిపాదనపై తమ వైఖరి ఏంటని అడుగుతున్నారని, ఎవరైనా ఓ జోక్ వింటే గట్టిగా నవ్వాలి తప్ప స్పందించాల్సిన అవసరం లేదని ఆమె కొట్టిపారేశారు. ఇదే సందర్భంలో, గతంలో నిండు సభలో వైఎస్ విజయమ్మను అవమానించినందుకు మంత్రి బొత్స సత్యనారాయణ ఎంత ఏడ్చినా తక్కువేనని కూడా షర్మిల వ్యాఖ్యానించారు.

# మంత్రులకు చంద్రబాబు సీరియస్ వార్నింగ్..

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలతో ముగిసింది. సుమారు మూడు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ భేటీలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలతో పాటు, కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానాలు చేశారు. అయితే, అజెండా అంశాలపై చర్చ ముగిసిన తర్వాత మంత్రులతో ప్రత్యేకంగా సమావేశమైన ముఖ్యమంత్రి, ప్రభుత్వ సమాచారం లీక్ అవుతున్న తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేబినెట్ అజెండా, ఇతర రహస్య వివరాలు సమావేశానికి ముందే బయటకు రావడంపై మంత్రులను నిలదీశారు. గతంలో ఇలాంటి లీకుల కారణంగానే ఎన్టీఆర్ తన కేబినెట్‌ను రద్దు చేయాల్సి వచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతమైతే సంబంధిత మంత్రులనే బాధ్యులను చేస్తూ కఠిన చర్యలు తీసుకుంటానని స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు.

ప్రభుత్వ పథకాల అమలు తీరుపై కూడా ముఖ్యమంత్రి మంత్రులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా 'జలధార' పథకం ప్రయోజనాలు ప్రజల్లోకి బలంగా వెళ్లేలా అవగాహన కల్పించాలని సూచించారు. భూములకు సంబంధించిన పాస్‌బుక్స్ పంపిణీ వ్యవహారంపై రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని... మంత్రులు, అధికారులు నెలకు కనీసం నాలుగు సార్లు జిల్లాల్లో పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ 'సూర్య ఘర్' పథకం లక్ష్యాలను వచ్చే ఏడాది నాటికి పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రులకు స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న మహిళా బిల్లు అంశంపై కూడా కేబినెట్‌లో ప్రాథమిక చర్చ జరిగింది.

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై కూడా ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. రాబోయే మూడు నుంచి నాలుగు నెలల వ్యవధిలో

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. పరిపాలనలో పారదర్శకత పెంచాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ పథకాల అమలులో వేగం పెంచాలని ముఖ్యమంత్రి మంత్రులకు నిర్దేశించారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న కార్యక్రమాల వివరాలు గోప్యంగా ఉంచాలని, క్రమశిక్షణారాహిత్యాన్ని సహించేది లేదని చంద్రబాబు తేల్చిచెప్పారు.

## పీఎన్జీ కనెక్షన్లు వేగవంతం చేయండి..

- మొదటి పేజీ తరువాయి

సొమ్మును యథావిధిగా వారి ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. ఈ విషయంపై లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, సంబంధిత ఉత్తర్వులను తక్షణమే జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. పీఎన్జీ వాడకం సురక్షితమని, చౌక అని ప్రజలకు వివరించాలన్నారు.

**కేంద్రమంత్రికి ఫోన్**

ప్రస్తుతం గృహ అవసరాలకు గ్యాస్ సరఫరాలో ఇబ్బందులను అధిగమించామని, త్వరలోనే పరిస్థితి సాధారణ స్థితికి వస్తుందని అధికారులు సీఎంకు వివరించారు. ఇదే సమయంలో శ్రీకాకుళం-కాకినాడ నేచురల్ గ్యాస్ పైప్‌లైన్ పనుల్లో జాప్యంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు.

కేంద్రం నుంచి కొన్ని అనుమతులు రావాల్సి ఉందని అధికారులు చెప్పడంతో, సమీక్ష సమావేశం నుంచే కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి చంద్రబాబు ఫోన్ చేశారు. టెండర్ల ప్రక్రియ పూర్తయినందున, పనులను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి, త్వరలోనే సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## నమాజ్ కోసం ఉగ్రవాదులపై దాడిని వాయిదా వేశాం..

భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఒక కీలక విషయాన్ని వెల్లడించారు. ఉగ్రవాద శిబిరంపై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో దాడి చేసేందుకు సిద్ధమైనప్పుడు, అక్కడ ఉగ్రవాదులు నమాజ్ చేస్తున్నారని తెలిసి దాడిని ఉద్దేశపూర్వకంగా వాయిదా వేసినట్లు తెలిపారు. సైనిక లక్ష్యాలతో పాటు మానవతా విలువలకు కూడా ప్రాధాన్యత ఇస్తామని చెప్పడానికి ఇది నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. రిషభ్ షా హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఐఐఎంయూఎన్ వారి 'బిఫోర్ ఐ బికేమ్ మీ' అనే పాడ్‌కాస్ట్‌లో జనరల్ ద్వివేది మాట్లాడారు. "మేము ఆ లక్ష్యాలను ఎప్పుడైనా ధ్వంసం చేయవచ్చు. కానీ, అవతలి వైపు ఉగ్రవాద శిబిరంలో వారు నమాజ్ చేస్తున్న సమయంలో దాడి చేయకూడదని నిర్ణయించుకున్నాం. ఎందుకంటే అందరి దేవుడు ఒక్కడే. అందుకే వారు ప్రార్థనలో లేని సమయాన్ని ఎంచుకున్నాం" అని ద్వివేది వివరించారు. ఈ సందర్భంగా తన వ్యక్తిగత జీవితం, నాయకత్వ శైలి గురించి కూడా ఆయన పంచుకున్నారు. సైన్యంలో మహిళల చేరిక, పని వాతావరణం వంటి విషయాల్లో తన కుమార్తెలు మార్గనిర్దేశం చేస్తారని తెలిపారు. "వారు చెప్పే విషయాలను నేను చాలా సీరియస్‌గా తీసుకుంటాను. అవసరమైన

చోట వాటిని అమలు చేస్తాను. వారే నాకు ఈ మార్పులను ఎలా స్వీకరించాలో నేర్పారు" అని ఆయన అన్నారు. తన సైనిక్ స్కూల్, నేషనల్ డిఫెన్స్ అకాడమీ రోజుల గురించి మాట్లాడుతూ, మార్కుల కన్నా వైఖరి, పరిస్థితులకు అనుగుణంగా మారగలగడమే ముఖ్యమని జనరల్ ద్వివేది అభిప్రాయపడ్డారు. "మార్కులు కేవలం చదువులోని ప్రతిభకు సూచిక మాత్రమే, అవి మీ వ్యక్తిత్వాన్ని నిర్ధారించలేవు" అని ఆయన వ్యాఖ్యానించారు. అత్యంత క్లిష్టమైన కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్లలో నైతిక సందిగ్ధత ఎదురైనప్పుడు, ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకోవడానికి భగవద్గీత, ఇతర ఆధ్యాత్మిక గ్రంథాలు ఎంతగానో సహాయపడతాయని జనరల్ ద్వివేది తెలిపారు.

## ట్రెండ్ ను ఫాలో కావొద్దు... సవాళ్లను స్వీకరించండి

- మొదటి పేజీ తరువాయి

ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. షార్ట్‌కట్‌లతో నిండిన ప్రస్తుత ప్రపంచంలో నైతికతే గొప్ప బలమని లోకేశ్ అన్నారు. "కేవలం ఏం నేర్చుకున్నారన్నది కాకుండా, ఎలా ఆలోచిస్తున్నారనేదే అత్యంత ముఖ్యం. ఎవరూ చూడనప్పుడు మనం ఎలా ప్రవర్తిస్తామో అదే మన నిజమైన వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుంది" అని విద్యార్థులకు హితవు పలికారు. లక్ష్య సాధనలో పట్టుదలతో ఉండాలని, ఎదురయ్యే అడ్డంకులను అవకాశాలుగా మార్చుకోవాలని సూచించారు.ఈ పర్యటన సందర్భంగా మంత్రి లోకేశ్ కీలక ప్రకటన చేశారు. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సత్వా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ పాఠశాల నడుస్తోందని, త్వరలోనే ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్, ముఖ్యంగా విశాఖపట్నం అభివృద్ధిలో భాగస్వామ్యం కాబోతోందని వెల్లడించారు. గ్రీన్‌వుడ్ హై స్కూల్ అంతర్జాతీయ స్థాయిలో పౌరులను (గ్లోబల్ సిటిజన్స్) తయారు చేస్తుండటం గర్వకారణమని ఆయన ప్రశంసించారు.

అంతకుముందు, పాఠశాల ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేశ్ కు నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం

ఆయన స్కూల్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఆర్ట్ గ్యాలరీ, తరగతి గదులను సందర్శించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన లోకేశ్, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందనలు తెలిపారు. విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించి, వారితో కలిసి గ్రూప్ ఫోటో దిగారు.

### నవ రాయ్‌పూర్‌ను ఉదాహరణగా చూపుతూ

## అమరావతిపై సజ్జల విమర్శలు

- మొదటి పేజీ తరువాయి

పరిస్థితి కూడా అలాగే మారుతుందని ఆయన హెచ్చరించారు.కేవలం ఎమ్మెల్యేలు, మంత్రులు, ఐఏఎస్ అధికారులు, జడ్జిల కోసం విలాసవంతమైన బంగ్లాలు కడుతున్నారే తప్ప, సామాన్య ప్రజలు అక్కడ నివసించే పరిస్థితి లేదని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ స్థాయిలో రేట్లు పెట్టి... ఎటువంటి మౌలిక సదుపాయాలు లేని చోటికి ప్రజలు ఎందుకు వస్తారని సజ్జల ప్రశ్నించారు.చంద్రబాబు అమరావతిని ఒక 'గ్రోత్ ఇంజిన్'లా కాకుండా, తన అవినీతికి తరగని గనిలా, అక్షయపాత్రలా వాడుకుంటున్నారని సజ్జల ఆరోపించారు. రాజధాని పేరుతో లక్షల కోట్ల రూపాయల అప్పులు తీసుకురావడం భావితరాలకు అన్యాయం చేయడమేనని మండిపడ్డారు. తన సొంత సంస్థ హెరిటేజ్‌ను నడిపేటప్పుడు తీసుకునే ఆర్థిక జాగ్రత్తలను, రాజధాని నిర్వహణలో చంద్రబాబు ఎందుకు పాటించడం లేదని నిలదీశారు. అప్పుల ద్వారా వచ్చే నిధులతో ఆకాశహర్మ్యాలు కట్టడం వల్ల రాష్ట్రానికి ఆదాయం ఎలా వస్తుందో చంద్రబాబు సూటిగా సమాధానం చెప్పలేకపోతున్నారని, ఆయన మాటల్లో డొల్లతనం కనిపిస్తోందని విమర్శించారు. మరోవైపు వైసీపీ అధినేత జగన్ ప్రతిపాదించిన మావిగన్ రాజధాని గురించి సజ్జల ప్రస్తావిస్తూ, అమరావతికి అయ్యే ఖర్చులో కేవలం 10 శాతంతోనే మరుసటి రోజు నుంచే పూర్తిస్థాయి రాజధానిగా మార్చవచ్చని తెలిపారు. మావిగన్ ప్రాంతం అంతర్జాతీయ విమానాశ్రయం, రైల్వే కనెక్టివిటీ, పోర్టుతో అనుసంధానం అయిందని, అక్కడ పెట్టుబడి పెడితే తక్షణమే ఫలితం ఉంటుందని వివరించారు.

రాష్ట్ర వనరులను సక్రమంగా వినియోగించుకోవాలన్నదే జగన్ ఆలోచన అని, కానీ చంద్రబాబు కేవలం భ్రమలు సృష్టిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వృథా ఖర్చులను ఆపి, ఆచరణాత్మకమైన రాజధాని వైపు అడుగులు వేయాలని సజ్జల సూచించారు.

## యూపీలో పడవ బోల్తా... 10 మంది మృతి...

- మొదటి పేజీ తరువాయి

ఈ క్రమంలో పడవ అదుపుతప్పి నదిపై ఉన్న ఫ్లోటింగ్ పాంటూన్ వంతెన (పైపా బ్రిడ్జి)ను ఢీకొట్టింది. దీంతో పడవ ఒక్కసారిగా నీటిలో మునిగిపోయింది. సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.ప్రమాద సమాచారం అందిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, స్థానిక గజ ఈతగాళ్లు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు 14 మందిని కాపాడి ఆసుపత్రికి తరలించగా, 10 మృతదేహాలను వెలికితీశారు. గల్లంతైన వారి కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు యమునా నదిలో తీవ్రంగా గాలిస్తున్నాయి.ఈ దుర్ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం యోగి అధికారులను ఆదేశించారు. స్థానిక యంత్రాంగం బాధితులకు అన్ని విధాలా అండగా నిలుస్తోందని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతుండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### భాగ్యనగరంలో 'ప్రేమ' ముసుగులో

## మతం మార్పిడి దందా

- మొదటి పేజీ తరువాయి

వంచన ఉదంతం నగరంలో తీవ్ర కలకలం రేపుతోంది. ప్రేమ పేరుతో వల వేయడం, ఆపై మతం మార్చుకోవాలంటూ తీవ్రస్థాయిలో వేధింపులకు గురిచేస్తున్న ఇద్దరు అన్నదమ్ముల వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. జమీర్, అతని తమ్ముడు మిరాజ్ కలిసి ఒక పక్కా ప్రణాళికతో అమాయక యువతులను ట్రాప్ చేస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ అన్నదమ్ములు ఇద్దరూ ఇప్పటివరకు సుమారు ఐదుగురు హిందూ యువతులను ప్రేమ పేరుతో నమ్మించి, వారి జీవితాలతో ఆడుకున్నట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి.నిందితుల్లో ఒకరైన జమీర్‌పై గతంలోనే పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదై ఉండటం గమనార్హం. ఒక మైనర్ బాలికను వేధించిన కేసులో జైలుకు వెళ్లి వచ్చినా, అతని ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని పోలీసులు గుర్తించారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత జమీర్ తన తమ్ముడు మిరాజ్‌తో కలిసి ఈ అరాచకాలను మరింత ముమ్మరం చేశాడు. తాజాగా మరో యువతిని తన ప్రేమ వలలో వేసుకున్న జమీర్, ఆమెను లొంగదీసుకున్న తర్వాత అసలు స్వరూపాన్ని బయటపెట్టాడు. సదరు యువతిపై అఘాయిత్యానికి పాల్పడటమే కాకుండా, ఆమెను తమ మతంలోకి మారాలని బలవంతం చేస్తూ తీవ్రమైన ఒత్తిడికి గురిచేశాడు. ఒకవేళ ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే ప్రాణాలు తీస్తామంటూ అన్నదమ్ములిద్దరూ కలిసి బాధితురాలిని బ్లాక్ మెయిలింగ్ చేసినట్లు సమాచారం.బాధితురాలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయడంతో ఈ అన్నదమ్ముల గుట్టు రట్టయింది. రంగంలోకి దిగిన పంజాగుట్ట పోలీసులు నిందితులపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ అన్నదమ్ములు కేవలం ఇద్దరే ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారా లేక వీరి వెనుక ఏదైనా పెద్ద ముఠా ఉందా అనే కోణంలో పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. బాధితుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉండటంతో, నిందితుల నుంచి ప్రాణహాని ఉన్న యువతులకు రక్షణ కల్పించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నగర నడిబొడ్డున మతం మార్పిడి లక్ష్యంగా జరుగుతున్న ఇటువంటి దాడులు స్థానిక ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి.

### భోగాపురం విమానాశ్రయం

## ప్రారంభోత్సవానికి మోదీకి ఆహ్వానం!

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం (అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం) ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారవుతోంది. ఈ మెగా ప్రాజెక్టును జాతికి అంకితం చేయాల్సిందిగా కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానమంత్రి మోదీకి అధికారికంగా ఆహ్వానం పంపారు. ప్రధాని షెడ్యూల్ లభ్యతను బట్టి జూలై 5 లేదా 8వ తేదీల్లో ఒక రోజును, లేనిపక్షంలో ఆగస్టు 17 లేదా 19 తేదీల్లో మరొక తేదీని ప్రారంభోత్సవానికి కేటాయించాలని ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేసినట్లు సమాచారం.ప్రస్తుతం ఈ విమానాశ్రయ పనులు తుది దశకు చేరుకున్నాయి. సుమారు 98 శాతం పనులు ఇప్పటికే పూర్తవ్వగా, మిగిలిన ఫినిషింగ్ పనులను జూన్ 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అదనపు సిబ్బందిని మోహరించి రాత్రింబవళ్లు యుద్ధ ప్రాతిపదికన పనులు కొనసాగిస్తున్నారు. ఈ అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోవడమే కాకుండా... పర్యాటక, పారిశ్రామిక రంగాలు కొత్త పుంతలు తొక్కుతాయని నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ విమానాశ్రయాన్ని కస్టమ్స్ ఎయిర్‌పోర్ట్‌గా కేంద్రం నోటిఫై చేయగా, అంతర్జాతీయ విమానాల రాకపోకలకు అవసరమైన ఇమ్మిగ్రేషన్ హోదాను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది.

## లొంగిపోయిన 42 మంది మావోయిస్టులు.. కీలక వ్యాఖ్యలు చేసిన తెలంగాణ డీజీపీ

- మొదటి పేజీ తరువాయి

వంటి కీలక నేతలు ఉండటం విశేషం. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, గత ఏడాదిన్నర కాలంలోనే మొత్తం 763 మంది మావోయిస్టులు హింసా మార్గాన్ని వీడి ప్రభుత్వానికి లొంగిపోయారని వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో పోలీసుల కూంబింగ్ కార్యకలాపాలు ముమ్మరం కావడంతో, తమ రక్షణ కోసం మావోయిస్టులు తెలంగాణ పోలీసులను ఆశ్రయిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. లొంగిపోయిన వారిలో అత్యధికులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారేనని, తెలంగాణకు చెందిన వారు కేవలం ఒక్కరే ఉన్నారని డీజీపీ స్పష్టం చేశారు. ఒకప్పుడు సెంట్రల్ కమిటీ, స్టేట్ కమిటీల్లో తెలంగాణ వాసుల ప్రాతినిధ్యం ఎక్కువగా ఉండేదని, కానీ ప్రస్తుతం ఆ సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని ఆయన వివరించారు. సెంట్రల్ కమిటీలో 11 మంది నుంచి ఇద్దరు, స్టేట్ కమిటీలో 24 మంది నుంచి కేవలం ఇద్దరు మాత్రమే మిగిలారని, వారు కూడా త్వరలోనే లొంగిపోవాలని ఆయన పిలుపునిచ్చారు. లొంగిపోయిన 42 మందికి పునరావాస ప్యాకేజీ కింద రూ. 1.93 కోట్ల నగదును అందజేయడంతో పాటు, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వారికి ప్రత్యేక ఆరోగ్య కార్డులను కూడా జారీ చేయనున్నట్లు డీజీపీ వెల్లడించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ పునరావాస అవకాశాలను అందిపుచ్చుకుని, అడవి బాట పట్టిన వారంతా తిరిగి రావాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రజల సమస్యలకు వేగవంతమైన పరిష్కారమే లక్ష్యం..ఎమ్మెల్యే గళ్ళా మాధవి..





గుంటూరు, పెన్ పవర్, ఏప్రిల్, 10, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమం కొనసాగుతోంది.ఈ సందర్భంగా టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజలుతమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి కి వివరించగా,వాటినిసంబంధితశాఖలకువెంటనే పంపించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఈ గ్రీవెన్స్ డే కార్యక్రమం ప్రజలకు ఉపయోగకరంగా మారిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ...కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ప్రజల అర్జీలపై నిరంతరం పర్యవేక్షణ చేస్తూ, సమస్యలు పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు ఫాలోఅప్ చేస్తామని హామీ ఇచ్చారు.ప్రజలకు అందుబాటులోఉండటం,వారి సమస్యలకు వెంటనే స్పందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

# కొండవీడు కోటలో ప్రేమజంట ఆత్మహత్య

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 10 : యడ్లపాడు : మండలంలోని కొండవీడు కోట పరిధిలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. విడిపోయి ఉండలేమన్న బాధతో ఓ ప్రేమజంట పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు స్వర్ణభారత్ నగర్‌కు చెందిన రసిక మనికంఠ రాజు (20), అంకమ్మ నగర్‌కు చెందిన ఓ యువతి గత రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే వీరి వివాహానికి పెద్దలు అంగీకరించకపోవడంతో, ఇటీవల యువతికి వేరే వ్యక్తితో వివాహం జరిపించారు. పెళ్లి తర్వాత భర్తతో ఉండలేక మనస్తాపానికి గురైన యువతి, తిరిగి గుంటూరుకు వచ్చేసింది. ఈ క్రమంలో ఈ నెల 7వ తేదీన మనికంఠ రాజుతో కలిసి కొండవీడు కోటకు వెళ్లిన ఆమె, అక్కడ ఇద్దరూ కలిసి 'స్ట్రైకర్' అనే పురుగుమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా వారిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మృతి

ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతూ మనికంఠ రాజు 8వ తేదీ సాయంత్రం కన్నుమూయగా, యువతి పరిస్థితి విషమించి 9వ తేదీన ప్రాణాలు విడిచింది.




పర్యాటక ప్రాంతమైన కొండవీడు కోటలో జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మృతుల తల్లులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ టి. శివరామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాజు మృతదేహానికి గురువారం పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించగా, యువతి మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు పోలీసులు తెలిపారు.

# బాపట్ల నియోజకవర్గం లో ఉన్న సర్పంచులు ఎంపీటీసీలు జడ్పిటిసిల సన్మాన కార్యక్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి






పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఏప్రిల్ 10: రాష్ట్రంలో వైసీపీ పార్టీ ఓడిపోయినప్పటికీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్థానికంగా నాపైన ఎంతో నమ్మకం ఉంచి ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా పార్టీ మారకుండా అలాగే నిలబడిన మీ అందరికీ పార్టీలో ఎప్పుడు సముచిత స్థానం ఉంటుందని మాజీ డిప్యూటీ స్పీకర్ బాపట్ల నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త కోన రఘుపతి తెలియజేశారు. శుక్రవారం పట్టణంలోని వీకన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటుచేసిన బూత్ ఇన్చార్జిల శిక్షణ కార్యక్రమంలో జిల్లా వైసీపీ అధ్యక్షుడు మాజీ మంత్రి మేరుగ నాగార్జున జిల్లాలోని ఇతర నియోజకవర్గాల సమన్వయకర్తలతో కలిసి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాపట్ల నియోజకవర్గంలో గత ఐదు సంవత్సరాలు పనిచేసిన ప్రస్తుత మాజీ సర్పంచులు ఎంపీటీసీలు జడ్పిటిసిని కోన రఘుపతి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి మాట్లాడుతూ కోన రఘుపతి మీద నమ్మకంతో జగన్మోహన్ రెడ్డి గారి మీద విశ్వాసంతో వైసీపీ పార్టీలోనే ఉంటూ ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్న మీకందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. పార్టీలో ఎప్పటికీ మీకు సముచిత స్థానం ఉంటుందని నూతనంగా ఏర్పాటైన బూత్ ఇన్చార్జిలతో సమన్వయం చేసుకుంటూ వైసీపీ పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేయాలి అన్నారు మరింతగా పార్టీని,పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకొని పెళ్లి మరల జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి అందరం కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సమన్వయకర్తలు పీతా మోహన్ కరణం వెంకటేష్ గాదే మధుసూదన్ రెడ్డి వరికూటి అశోక్ బాబు పార్టీ పరిశీలకులు బాపట్ల నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

# గుంటూరు మెడికల్ కాలేజీ 80 సంవత్సరాల ఘన చరిత్రలో మరో స్వర్ణాధ్యాయాన్ని ఈ రోజు లిఖించింది. డా. సుందరాచారి..



గుంటూరు, పెన్ పవర్, ఏప్రిల్, 10, గుంటూరు మెడికల్ కాలేజీ ప్రారంభించిన "గ్లోబల్ జర్నల్ ఆఫ్ గుంటూరు మెడికల్ కాలేజీ" మొదటి సంచికను ఈ రోజు ప్రిన్సిపాల్ మరియు జర్నల్ చీఫ్ పేట్రన్ డా. సుందరాచారి , ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు మరియు అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా. సుందరాచారి మాట్లాడుతూ, మన కళాశాల ఒక జర్నల్‌ను ప్రారంభించడం ఎంతో ఆనందదాయకమని, దీన్ని ప్రపంచ స్థాయి జర్నల్‌గా అభివృద్ధి చేయడానికి కృషి చేయాలని జర్నల్ ఎడిటోరియల్ బోర్డుకు సూచించారు. ప్రచురణకు ముందు సమగ్రంగా మరియు లోతుగా సమీక్షించేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సీనియర్ వైద్యులను ఎడిటోరియల్ బోర్డులో నియమించామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వైస్ ప్రిన్సిపాల్ (అకాడమిక్) డా. మాధవి ని ప్రత్యేకంగా అభినందిస్తూ, ఈ జర్నల్ ప్రారంభంలో ఆమె చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. అలాగే చీఫ్ ఎడిటర్ డా. తేజ్‌కుమార్ (అసోసియేట్ ప్రొఫెసర్, కమ్యూనిటీ మెడిసిన్) మరియు అసోసియేట్ చీఫ్ ఎడిటర్ డా. రమ్య (అసిస్టెంట్ ప్రొఫెసర్, ఫార్మకాలజీ)లను కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో




అడ్మిన్ ప్రిన్సిపాల్ డా. శ్రీధర్ , ఇతర ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు మరియు అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

# పెన్ పవర్ సెంట్రల్ ఆంధ్ర

కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

# పీఎన్జీ కనెక్షన్లు పెరగాలి... ఆయిల్ కంపెనీలు లక్ష్యం చేరుకోవాలి..

విజయవాడ, పెన్ పవర్, ఏప్రిల్, 10, యుద్ధాల కారణంగా తలత్తిన ఎల్పీజీ గ్యాస్ సరఫరా సమస్యను ఎదుర్కొనేందుకు మరింత సన్నద్ధతతో పనిచేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు, ఆయిల్ కంపెనీలకు సూచించారు. పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) వినియోగం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. దీపం పథకం లబ్దిదారులకు పీఎన్జీ వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. దీపం పథకం లబ్దిదారులు పీఎన్జీకి మారితే... వారికి దీపం పథకం కింద ఇచ్చే రాయితీ సొమ్మును జమ చేసేందుకు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామని... దీనిపై వెంటనే ఉత్తర్వులు విడుదల చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. పీఎన్జీ కనెక్షన్ తీసుకున్నా దీపం పథకం ద్వారా కలిగే లబ్ది పొందవచ్చన్న విషయంపై లబ్దిదారులకు అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష



నిర్వహించారు. గ్యాస్ సరఫరా ఇబ్బందులను అధిగమించడానికి ఆయిల్ కంపెనీలు పీఎన్జీ కనెక్షన్లను పెంచేందుకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. వచ్చే 6 నెలల్లో మొత్తం 10 లక్షల పీఎన్జీ కనెక్షన్లు ఇవ్వాలని... ఈ విషయంలో జాప్యం ఉండకూడదని, టార్గెట్ ఎట్టిపరిస్థితుల్లో చేరుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గృహ అవసరాలకు సంబంధించి గ్యాస్ సరఫరాలో సమస్యలను అధిగమించామని తెలిపారు. డొమస్టిక్ పంపిణీకి సంబంధించి సమస్యను తగ్గించామని... త్వరలో సాధారణ స్థితికి తీసుకువస్తామన్నారు. శ్రీకాకుళం కాకినాడ నేచురల్ గ్యాస్ పైప్ లైన్ పనుల్లో జాప్యంపై సీఎం అధికారుల వివరణ కోరారు. దీనికి సంబంధించి కేంద్రం కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని అధికారులు చెప్పడంతో... సమీక్ష నుంచే కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరికి ముఖ్యమంత్రి ఫోన్ చేశారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి అయినందున వెంటనే పనులు పూర్తి చేసేలా చూడాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి త్వరలోనే సమీక్షించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఎడవల్లి వద్ద అనుమానాస్పద మృతి

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 10 : చిలకలూరిపేట : మండల పరిధిలోని ఎడవల్లి సమీపంలో చీమకుర్తికి చెందిన న్యాయవాది శ్రీరామ్ హరి ప్రసాద్ (39) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. రోడ్డుపై ఆయన శరీరంపైనే స్కూటీ పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. వృత్తిరీత్యా లాయర్ కావడంతో ఇది ప్రమాదమా లేక మరేదైనా కారణమా? ఘటనపై ఎస్సై అనిల్ కుమార్ ప్రాథమిక విచారణ చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం



ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గృహ అవసరాలకే తొలి ప్రాధాన్యత

## ఓ టి పి ద్వారానే డెలివరీ డి ఎస్ ఓ - ఆర్ .జమీర్ బాషా

పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఏప్రిల్ 10: జిల్లాలో వంట గ్యాస్ కొరతలేదు ప్రజలు ఎవ్వరు కంగారు పడవలసిన అవసరం లేదని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఆర్.జమీర్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వంట గ్యాస్ కొరతలేదని ఎవ్వరు కూడా కంగారు పడవలసి అవసరం లేదని,నేటికి జిల్లాలో 6096 గ్యాస్ సిలిండర్లు ప్రజలకుఅందుబాటులోఉన్నాయిని తెలిపారు,మీ సెల్ కు ఓ టి పి వచ్చిన తర్వాత నే గ్యాస్ సిలిండర్ డెలివరీ అవుతుందని గ్యాస్ వినియోగదారుల కు చూచించారు. గ్యాస్ సిలిండర్లు బాయ్స్ వినియోగదారుల నుండి ఎక్కువ మొత్తం డబ్బులు వసూలు చేస్తే వెంటనే జిల్లా కలెక్టరేట్ లోని



కంట్రోల్ రూమ్ నెం.94932 47765 కు కాల్ చేసి పిర్యాదు చేయాలని ఆయన అప్రకటనలో తెలిపారు.

# పౌరులందరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారిని కాపాడాలి : జిల్లా కలెక్టర్

కృష్ణా : పెన్ పవర్, ఏప్రిల్, 10: జిల్లాలోని పౌరులందరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. జాతీయ సర్వే దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం నగరంలోని కలెక్టర్ వారి కార్యాలయ ప్రాంగణంలో సర్వే భూ రికార్డుల సర్వే కార్యాలయ ముంగిట జిల్లా కలెక్టర్ డి కె బాలాజీ సంయుక్త కలెక్టర్ ఎం నవీన్ తో కలసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వారు రక్తదానం చేసి అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారు. పలువురు సర్వే సిబ్బంది కూడా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ..జాతీయ సర్వే దినోత్సవం పురస్కరించుకొని రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి, సర్వేయర్లందరూ రక్తదానం చేయడం స్ఫూర్తిదాయకమని అన్నారు.



ఆసుపత్రులలో పరిశీలిస్తే ప్రతిరోజు ఏదో రకమైన ప్రమాదాలతో వచ్చే రోగులకు గాని , వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో రక్తహీనత ఉండే రోగులకు గాని రక్తం చాలా అవసరం ఉంటుందన్నారు. సర్వే శాఖ వారు ఇటువంటి రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిల్లాలోని పౌరులందరూ రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చి ఆపదలో ఉన్న వారిని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో భూమి , సర్వే రికార్డుల శాఖ ఏడి పి.లక్ష్మణరావు, గుడివాడ ఆర్డీఓ జి బాలసుబ్రమణ్యం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ సిరివి శెట్టి భాస్కర్, డాక్టర్ డి హనుమంతయ్య, కోశాధికారి కుమార్, జిల్లా సమన్వయకర్త హరికృష్ణ, పలువురు సర్వేయర్లు, సర్వే శాఖ సిబ్బంది, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

# టిడిపి పార్టీ కార్యాలయంలో పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమం.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా వేదిక

బాధితులకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు భరోసా

వారం రోజుల్లోగా సమస్యలు పరిష్కరించాలి. అధికారులకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆదేశం







నరసరావుపేట పెన్ పవర్ ఏప్రిల్ 10: నరసరావుపేట నియోజకవర్గ ప్రజల కష్టాలను తీర్చి, వారికి అండగా నిలవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం నాడు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఆయన పి.జి.ఆర్.ఎస్ (పబ్లిక్ గ్రీవాన్స్ రెడ్రెస్సల్ సిస్టం ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను ఎమ్మెల్యే కి విన్నవించుకున్నారు. ప్రధానంగా భూ సమస్యలు, రేషన్ కార్డులు, పెన్షన్లు మరియు స్థానిక మౌలిక సదుపాయాలకు సంబంధించిన సుమారు 30 అర్జీలను బాధితులు ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్లో మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వారం రోజుల్లోగా పూర్తిస్థాయి విచారణ జరిపి, త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో ఉన్న ప్రతి సమస్యకు న్యాయం జరిగేలా చూడాలని, బాధితులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవడానికి కార్యాలయం వరకు రావడం చూస్తుంటే వారి ఇబ్బందులు అర్థమవుతున్నాయి. అధికారుల సమన్వయంతో ప్రతి సమస్యను పరిష్కరిస్తాం. బాధితులకు న్యాయం జరిగే వరకు నేను పర్యవేక్షిస్తాను అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో బాధితులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మండల టౌన్ నాయకులు గ్రామ నాయకులు పాల్గొన్నారు

# పేదల పెన్నిధి కూటమి ప్రభుత్వం

## 25 మందికి రూ.12 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు

## పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు







నరసరావుపేట పెన్ పవర్ ఏప్రిల్ 10: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, అపర చాణక్యుడు నారా చంద్రబాబు నాయుడు సమర్థవంతమైన పాలన, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయ సాధన, మరియు విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ దూరదృష్టితో రాష్ట్రంలో సంక్షేమ పాలన వెల్లివిరుస్తోందని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు పేర్కొన్నారు. పేద ప్రజల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం నరసరావుపేటలోని టిడిపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన 25 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 12 లక్షల రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్ ) చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో నిరుపేదలందరికీ మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. పవన్ కళ్యాణ్, లోకేష్ బాబు రాష్ట్ర ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తూ ప్రజా సంక్షేమ ఫలాలను నేరుగా ప్రజల వద్దకు చేరుస్తున్నారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఒక వరంలా మారింది. ఎటువంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అత్యంత పారదర్శకంగా నేరుగా అర్హులకు ఈ ఆర్థిక సాయం అందుతోంది. నియోజకవర్గ ప్రజల కష్టాల్లో తాను ఎల్లప్పుడూ ముందుంటానని, ప్రజలకు సేవ చేయడమే తన ప్రథమ కర్తవ్యమని ఆయన ఉద్ఘాటించారు. లబ్ధిదారులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా తమకు ఆర్థిక ఆసరా కల్పించి అండగా నిలిచినందుకు లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి, పవన్ కళ్యాణ్ కి, లోకేష్ బాబు కి మరియు తమ కష్టాన్ని గుర్తించి వెన్నంటే ఉంటున్న ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నియోజకవర్గ మహిళ సమైక్య సంఘం నూతన కమిటీ ఎన్నిక



పెన్ పవర్ కారంపూడి ఏప్రిల్ 10 :-- మాచర్ల నియోజకవర్గంలో మహిళల సంఘటిత శక్తిని బలోపేతం చేసే దిశగా మహిళ సమైక్య సంఘం నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమం ఆదినారాయణ స్తూపం వద్ద సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మేకపోతు శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించబడింది. సభకు మహిళా సమైక్య సంఘం జిల్లా కార్యదర్శి నిర్మల, జిల్లా అధ్యక్షురాలు ఏకే నాగమణి ముఖ్య అతిథులుగా హాజరై మహిళల హక్కులు, సాధికారత, సామాజిక న్యాయం వంటి అంశాలపై విస్తృతంగా ప్రసంగించారు. మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, ముఖ్యంగా ఉపాధి, భద్రత, విద్య, ఆరోగ్యం వంటి రంగాలలో ఉన్న సవాళ్లను ప్రస్తావిస్తూ, మహిళలు సంఘటితంగా ముందుకు వస్తేనే స్థిరమైన పరిష్కారాలు సాధ్యమని పేర్కొన్నారు. అలాగే గ్రామీణ స్థాయిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం, ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేయించుకోవడం, మహిళలపై జరిగే అన్యాయాలపై చట్టపరంగా పోరాటం చేయడం వంటి అంశాల్లో మహిళ సమైక్య సంఘం కీలక పాత్ర పోషించాలన్నారు. మహిళలు స్వయం సహాయక బృందాల ద్వారా ఆర్థికంగా బలపడాలని, సామాజిక చైతన్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గ మహిళ సమైక్య సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా మల్లల వరలక్ష్మి, కార్యదర్శిగా పాగా ల శశిదేవిని ఎంపిక చేశారు. అదనంగా మరో 9 మంది సభ్యులతో కమిటీని విస్తరించారు. నూతన కమిటీ సభ్యులు మహిళల సంక్షేమం, హక్కుల సాధన, సామాజిక సమస్యల పరిష్కారం కోసం కట్టుబడి పనిచేస్తామని హామీ ఇచ్చారు. సభలో సిపిఐ నాయకులు మండల కార్యదర్శి షేక్ సైదా, రైతు సంఘం ఏరియా కార్యదర్శి మేకపోతు చినుకోటిరెడ్డి, సిపిఐ పట్టణ కార్యదర్శి సూరె హనుమంతరావు మహిళా సంఘ సభ్యులు, స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# జిఎస్టి వసూళ్లపై పల్నాడు జిల్లా కలెక్టర్ సమీక్ష




నరసరావుపేట పెన్ పవర్ ఏప్రిల్ 10: పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల, గుంటూరు జాయింట్ కమిషనర్ (రాష్ట్ర పన్నులు) జాన్ స్టీవెన్సన్ పాత్రో ఆధ్వర్యంలో జిఎస్టి కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో జిఎస్టి వసూళ్లను మరింత సమర్థవంతంగా పెంచేందుకు వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జిఎస్టి ఆదాయ వృద్ధికి సంబంధిత శాఖల అధికారులు అందించాల్సిన సహకారంపై జాయింట్ కమిషనర్ వివరించారు. ఈ సమావేశంలో జిల్లా స్థాయి అధికారులతో పాటు నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల ప్రాంతాలకు చెందిన అసిస్టెంట్ కమిషనర్లు (రాష్ట్ర పన్నులు) పాల్గొన్నారు.

# శ్రీకాకుళం జిల్లా వెనుకబడిన జిల్లా కాదు..

# అవకాశాల గని!కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు..






విజయవాడ,పెన్ పవర్, ఏప్రిల్, 10, శ్రీకాకుళం జిల్లాను ఇకపై ఎవరూ వెనుకబడిన ప్రాంతంగా చూడకూడదని ఇది అపారమైన అవకాశాలకు నెలవని (డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆపర్చునిటీ) కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయమైన 'పి-4' స్ఫూర్తితో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో వికసిత భారత్ లక్ష్యానికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. నగర శివారులోని శాంతి కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం ట్రైనీ లూప్', బచ్ పన్ బచావో సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన దక్షిణ భారత 3వ సి.ఎస్.ఆర్ (కార్పొరేట్ సామాజిక బాధ్యత) సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు.

హైదరాబాద్‌లో జరిగిన సి.ఎస్.ఆర్ సదస్సుకు హాజరైన పి.యు.సి చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్.. అటువంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని శ్రీకాకుళంలో నిర్వహించేలా చేయడంలో కీలక పాత్ర పోషించారని మంత్రి కొనియాడారు. ఆయన పట్టుదల, నిరంతర కృషి వల్లే నేడు 50 స్వచ్ఛంద సంస్థలు, 13 దిగ్గజ కార్పొరేట్ కంపెనీలు మన జిల్లాలో ఒకే వేదికపైకి రాగలిగాయని పేర్కొన్నారు. జిల్లాలో సామాజిక బాధ్యత నిధుల వినియోగాన్ని వివరిస్తూ.. కోల్ ఇండియా సంస్థ తన సి.ఎస్.ఆర్ నిధులతో సాగరమాల పథకం కింద తీరప్రాంత మత్స్యకార గ్రామాల్లో సోలార్ లైట్లను ఏర్పాటు చేసిందని, ఇది క్షేత్రస్థాయిలో వచ్చిన గొప్ప మార్పు అని మంత్రి గుర్తుచేశారు. భారతదేశంలో కంపెనీల నికర లాభంలో 2 శాతాన్ని సామాజిక సేవకు కేటాయించాలని కేంద్రం చట్టం తెచ్చింది. అయితే చాలామంది పారిశ్రామికవేత్తలకు నిధులు ఉన్నా, సేవారంగంలో అనుభవం ఉండదు. అటువంటి వారికి 'ట్రైనీ లూప్

బచ్‌పన్ బచావో' వంటి సంస్థలు మార్గదర్శకత్వం వహిస్తూ వారధిలా నిలుస్తున్నాయి" అని ప్రశంసించారు. జిల్లా ఎదుగుతున్న తీరును చూసి యువతలో ఆత్మవిశ్వాసం పెరుగుతోందని, ఆరోగ్యం, విద్య, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా 'సి.ఎస్.ఆర్' సెల్ ద్వారా నియోజకవర్గాల వారీగా అభివృద్ధి పనులకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు.

సిద్ధంగా డి.పి.ఆర్లు: కలెక్టర్

జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటికే రూ. 41.44 కోట్ల సి.ఎస్.ఆర్ నిధులు వినియోగించామని, మరో రూ. 45 కోట్లతో సరికొత్త ప్రాజెక్టు నివేదికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. టెక్ మహేంద్ర, విప్రో, ఇన్ఫోసిస్, కోరమాండల్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, లూపిన్, ఇండియా ఐటి సొల్యూషన్స్, క్యూ సిటీ, రెడెసినర్జీస్, మాకాఫ్, కో ఐటి సొల్యూషన్స్, కాగ్నిజెంట్, కేప్జెమిని వంటి ప్రముఖ సంస్థల భాగస్వామ్యం జిల్లా ముఖచిత్రాన్ని మార్చనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లా పారిశ్రామిక పెట్టుబడులకు అత్యుత్తమ ప్రాంతమని, పెట్టుబడిదారులు జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన వంశధార, నాగావళి నదుల నీటి లభ్యతతో పాటు అద్భుతమైన రవాణా వనరులు ఉన్నాయని పేర్కొన్నారు. నిర్మాణంలో ఉన్న మూలపేట పోర్టు, త్వరలో అందుబాటులోకి రానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, ఇప్పటికే ఉన్న జాతీయ రహదారులు జిల్లా ముఖచిత్రాన్ని మార్చనున్నాయని వివరించారు. కొత్త పరిశ్రమల ద్వారా స్థానిక యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యమని, పెట్టుబడిదారులకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలా మద్దతు ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. జిల్లాను పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, మామిడి గోవిందరావు మాట్లాడుతూ.. జిల్లాలోని యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలని కోరారు. వంశధార మిగులు భూముల్లో పరిశ్రమల ఏర్పాటు, గ్రామాలను దత్తత తీసుకోవడం వంటి చర్యల ద్వారా వలసలను నివారించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీవో కె. సాయి ప్రత్యూష,

సోయల్ హెల్త్ ప్రతినిధి ఫల్గుణ రాజు, టెక్ మహేంద్ర, విప్రో, ఇన్ఫోసిస్, కోరమాండల్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, లూపిన్, ఇండియా ఐటి సొల్యూషన్స్, క్యూ సిటీ, రెడెసినర్జీస్, మాకాఫ్, కో ఐటి సొల్యూషన్స్, కాగ్నిజెంట్, కేప్జెమిని, తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఈ నెల 18న మన వారసత్వానికి ఘనమైన

# వెలుగు.. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ..






విజయవాడ, పెన్ పవర్, ఏప్రిల్, 10, మన ఘనమైన వారసత్వాన్ని కాపాడుకుంటూ బలమైన భవిష్యత్తును నిర్మించే ప్రయత్నంలో భాగంగా ఈ నెల 18న ప్రపంచ వారసత్వ దినోత్సవం (వరల్డ్ హెరిటేజ్ డే ) సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని, వినూత్న కార్యాచరణతో వారసత్వానికి పట్టంకట్టే ఈ చొరవను విజయవంతం చేద్దామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలపై కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర పర్యాటక, ఎన్‌టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం, జిల్లా పర్యాటక ప్రాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కనకదుర్గమ్మ వారి ఆలయంతో పాటు మొగల్రాజపురం గుహలు, అక్కన్న మాదన్న గుహలు, గాంధీ కొండ, కొండపల్లి ఖిల్లా.. ఇలా మన ఘన సాంస్కృతిక వారసత్వ సంపదకు ఎన్నో ప్రతీకలు ఉన్నాయని.. వీటిని కాపాడుకుంటూ భావితరాలకు విలువైన వెలకట్టలేని వారసత్వాన్ని బహుమతిగా ఇవ్వాల్సిన అవసరం ఉందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. హెరిటేజ్ ట్రెక్కింగ్ నుంచి సంగీత స్వర ఝరి వరకు. ఈ నెల 18వ తేదీ ఉదయం కొండపల్లి ఖిల్లాపైకి హెరిటేజ్ ట్రెక్కింగ్ ఉంటుందని.. ఉదయం 6 గంటలకు ఇది ప్రారంభమవుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. అదేవిధంగా కొన్ని స్పోర్ట్స్ ఈవెంట్లు కూడా జరుగుతాయన్నారు. ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఐఎన్‌టీఏసీహెచ్) భాగస్వామ్యంతో నగరంలో హెరిటేజ్ వాక్ కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. కొండపల్లిలో కొండపల్లి బొమ్మలతో మేళా కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని.. ఇది మూడు రోజుల పాటు కొనసాగుతుందని వెల్లడించారు. వారసత్వ సంస్కృతి, ఆధునిక జెన్ జెడ్, పండగలు, సుస్థిర అభివృద్ధి తదితర అంశాలపై మార్చి 8న కొండపల్లి బొమ్మల పోటీ నిర్వహించడం జరిగిందని.. ఇందులోని విజేతకు కొండపల్లి బొమ్మల మేళా కార్యక్రమం సందర్భంగా రూ. లక్ష విలువైన బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 18వ తేదీ రాత్రి ఇందిరాగాంధీ మునిసపల్ మైదానం పక్కన ఖాళీ స్థలంలో సంగీత ఝరితో వారసత్వానికి పట్టంకట్టే కార్యక్రమం జరుగుతుందని.. ఈ కార్యక్రమానికి ప్రముఖ గాయకులు ఎస్‌పీ చరణ్, సునీత తదితరులు పాల్గొంటారని తెలిపారు. వారసత్వ ఔన్నత్యానికి ప్రతీకలుగా నిలిచే వారిని గుర్తించి, వారిని ఘనంగా సత్కరించడం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. వారసత్వ సంపదను భావితరాలకు అందించే బృహత్ సంకల్పానికి ప్రతిఒక్కరూ కలిసిరావాలని.. సమష్టి కృషితో విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ ఒక్క సంవత్సరానికి పరిమితం కాకుండా వీటిని ఏటా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో ఇన్‌టాక్ విజయవాడ చాప్టర్ కన్వీనర్ సాయి పాపినేని, ఆర్‌టీఐహెచ్ విజయవాడ సీఈవో జి.కృష్ణన్, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, కొండపల్లి బొమ్మల హస్తకళాకారుల సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధన దిశగా కూటమి ప్రభుత్వం

కోవూరు పెన్ పవర్ ఏప్రిల్ 10. సామాజిక సమానత్వానికి మార్గదర్శి మహాత్మా పూలే సమాజంలోని అసమానతలను రూపు మాపి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తోడ్పడటమే పూలె ఇచ్చే నిజమైన నివాళి.ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి.భారత సామాజిక విప్లవ పితామహుడు మహాత్మా జ్యోతిరావు ఫూలే జయంతిని పురస్కరించుకుని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆయనకు ఘన నివాళులు అర్పించారు. కుల వివక్ష లేని సమాజం కోసం అణగారిన వర్గాల హక్కుల కోసం పూలే చేసిన పోరాటం దేశ చరిత్రలో అజరామరమని ఆమె ఒక ప్రకటనలో కొనియాడారు. ముఖ్యంగా మహిళా విద్యే సామాజిక మార్పుకు మూలమని నమ్మిన ఫూలే, తన సతీమణి సావిత్రిబాయి ఫూలేతో కలిసి చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మహాత్మా ఫూలే ఆశయాలకు అనుగుణంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వెనుకబడిన మరియు బడుగు, బలహీన వర్గాల సర్వతోముఖాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు.బలహీన వర్గాలను వెన్నెముకగా భావించే కూటమి ప్రభుత్వం వారి ఆర్థిక మరియు రాజకీయ సాధికారత కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వెనుకబడిన వర్గాలకు అండగా నిలుస్తూ పూలే కలలుగన్న సామాజిక సమానత్వ ఆశయ సాధనకు కృషి చేస్తుందన్నారు. అణగారిన వర్గాల గొంతుకగా నిలిచిన మహాత్మా పూలే అడుగుజాడల్లో నడుస్తూ కోవూరు నియోజకవర్గంలోని ప్రతి పేదవాడికి ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వెల్లడించారు. సమాజంలోని అసమానతలను రూపు మాపి బడుగు, బలహీన



వర్గాల అభ్యున్నతికి తోడ్పడటమే మహాత్మా జ్యోతిరావు పూలే ఇచ్చే నిజమైన నివాళి అని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సి.ఎస్.పురం (ప్రకాశం) : పెన్ పవర్, ఏప్రిల్, 10: మండల పరిధిలోని కొండబోయినపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సి.ఎస్.పురం మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన నాయబ్ రసూల్, వత్తిరీత్యా ప్రైవేట్ ఎలక్ట్రీషియన్. శుక్రవారం సి.ఎస్.పురం -- డిజిపేట మార్గమధ్యంలో బైక్‌పై వెళ్తుండగా, కొండబోయినపల్లి వద్ద అకస్మాత్తుగా ఒక గేదె అడ్డువచ్చింది. దీంతో బైక్ అదుపుతప్పగా, వెనుక కూర్చున్న నాయబ్ రసూల్ ప్రమాదవశాత్తూ కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో ఆయన తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే అపస్మారక స్థితిలోకి వెళ్లారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం బాధితుడిని సి.ఎస్.పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో, వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం ఆయనను ఒంగోలు రిమ్స్‌కు ఆసుపత్రికి తరలించారు.

# శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తా : ఎస్సై సుమతి

తిరుపతి క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, ఏప్రిల్ 10. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తిరుచానూరు ఎస్సై, సుమతి తెలియజేశారు. గురువారం పద్మావతి అమ్మవారి దర్శనం చేసుకుని అనంతరం పదవి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ, సుమతి మాట్లాడుతూ......జిల్లా ఎస్పీ, సుబ్బరాయుడు ఆదేశాల మేరకు శాంతి భద్రతలకు కృషి చేస్తానని తెలియజేశారు. అలాగే ప్రజలకు సకాలంలో న్యాయం జరిగేలా చూస్తామన్నారు. మహిళల సమస్యలను తన కుటుంబ సభ్యులు సమస్యలుగా గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఇటీవల రోజురోజుకు జరుగుతున్న సైబర్ నేరాలు వాటిపై అవగాహన కల్పిస్తూ, రానున్న వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు కచ్చితంగా పోలీస్ స్టేషన్ కు తెలియజేయడంతో పాటు ఆ ఇంటికి సంబంధించి వివరాలు తెలియజేస్తే ఆ ఇంటిపై నిఘా ఉంచటంతో పాటు దొంగతనాలు నివారణకు కృషి చేస్తామన్నారు. అనంతరం మర్యాదపూర్వకంగా చంద్రగిరి సబ్ డివిజన్ డిఎస్పి, సిఐను మర్యాదపూర్వకంగా కలిశారు.



# రెండు సంవత్సరాలు గాలికొదిలేసి ఇప్పుడు ప్రజలపై ప్రేమ పుట్టిందా ?

## ఎమ్మెల్యేపై మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ్ విమర్శ

పలమనేరు,పెన్ పవర్, ఏప్రిల్ 10, రెండు సంవత్సరాలు గాలికొదిలేసి ఇప్పుడు ప్రజలపై ప్రేమ పుట్టిందా అంటూ ఎమ్మెల్యేపై నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ విమర్శించారు. శుక్రవారం వి.కోట మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ..స్థానిక శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి గత రెండు సంవత్సరాలుగా పలమనేరు నియోజకవర్గాన్ని గాలికి వదిలేసి,ఇప్పుడు “మన ఊరికే మన ఎమ్మెల్యే” పేరుతో పర్యటనలు చేస్తానని చెప్పడం ఆశ్చర్యకరం.ఇది కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మందలింపుల తర్వాతనే మొదలైన చర్య అని న్యూస్ చానెల్స్ లో ప్రచారం జరుగుతుందని అన్నారు.ఆయన గ్రామాల్లో తిరగడంపై ఎవరికీ అభ్యంతరం లేదు.కానీ గత మూడు రోజులుగా జరుగుతున్న పర్యటనలు చూస్తే, సాధారణ ప్రజల ఇళ్లకు వెళ్లడం లేదు,కేవలం స్థానిక టీడీపీ నాయకుల ఇళ్లకే పరిమితమవుతున్నాయి.ప్రజల సమస్యలు తెలుసుకునే ప్రయత్నం కూడా కనిపించడం లేదు.చిత్తశుద్ధి లేని పర్యటనల వలన ప్రజలకి కలిగే ఉపయోగం ఏంటి అని ప్రశ్నిస్తున్నానన్నారు. గడిచిన 22 నెలలుగా పింఛన్లు ఇస్తూ ఫోటోలు దిగుతున్నా,కొత్తగా అర్హులైన వారికి ఒక్క పింఛన్ ఇచ్చారా? మా ప్రభుత్వ కాలంలో 10 వేల మందికి ఒక్క వి.కోట లోనే ఇళ్ల పట్టాలు ఇచ్చాం.మీరు ఒక్కరికైనా ఇళ్ల పట్టా ఇచ్చారా? “సూపర్ సిక్స్” హామీల్లో ఎంత నెరవేర్చారు? ప్రజల ఆర్థిక స్థితిగతులు ఏమైనా మెరుగుపడ్డాయా? వీటిపైనా ఏమైనా అవగాహన ఉందా? రెండు రోజుల క్రితం వి.కోట మండలంలోని కృష్ణాపురం నుంచి యడగురికి గ్రామం వరకు రూ.53 లక్షల వ్యయంతో 27 డిసెంబర్ 2022న ప్రారంభించిన రోడ్డుకు, ఇప్పటికే నిర్మించబడిన పనికే పక్కనే కొత్త శిలాఫలకం ఏర్పాటు చేసి 2018లో నిర్మాణం జరిగిందని ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరుగుతోంది. ఇప్పటికే పూర్తయిన పనులకే మళ్లీ కొత్త శిలాఫలకాలు పెట్టి, కోట్ల రూపాయల అభివృద్ధి చేసినట్లు



ప్రచారం చేయడం సిగ్గుచేటు కాదా? ఇవన్నీ పాత పనులే మళ్లీ ఎందుకు ఈ నాటకాలు, ప్రారంభోత్సవాలు? అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. ఇక ప్రభుత్వ పాఠశాల భూములపై కన్నేసి షాపింగ్ కాంప్లెక్సులు నిర్మించాలనే ప్రయత్నాలు అత్యంత ఆందోళనకరం.దీనిపై హైకోర్టు ద్వారా మేము అడ్డుకుని స్పష్టంగా ఆంక్షలు విధించినా, ఇలాంటి ప్రయత్నాలు కొనసాగడం దురదృష్టకరం. పలమనేరు ప్రజల హక్కులను కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండదు.కబ్జాలు, వేధింపులు ఎదుర్కొంటున్న ప్రతి సామాన్యుడికి వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని ఆయన అన్నారు.ఇందులో వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.ఎన్.నాగరాజు, మాజీ ఎంపీపీ యువరాజు తదితరులు పాల్గొన్నారు.

# పొలం లాక్కోవాలని చూస్తున్నారు ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతున్నారు

కావలి ఆర్సి ఇంచార్జ్ పెన్ పవర్ ఏప్రిల్ 10 మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో 30 సంవత్సరాల నుండి సాగు చేసుకుంటున్న భూమిని గ్రామానికి చెందిన నాగి వెంకటేశ్వర్లు అతని కుటుంబ సభ్యులు లాక్కోవాలని చూస్తున్నారని, ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నారని గ్రామానికి చెందిన రైతు కాసు మహేశ్వరరావు ఆరోపించారు. ఈ మేరకు ఆయన జలదంకిలో శుక్రవారం మీడియా సమావేశంలోమాట్లాడారు. గ్రామంలో నాలుగు ఎకరాల 40 సెంట్లు భూమిని తన తండ్రి రామకృష్ణయ్య అనంతరం తాను సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. అయితే ఈ భూమికి గ్రామానికి చెందిన నాగి వెంకటేశ్వర్లు తండ్రి సుబ్బారాయుడు పేరు మీద డి ఫారం పట్టా ఇచ్చారన్నారు. అయితే తాను ఆ పొలంలో 30 సంవత్సరాల నుండి సాగులో ఉన్నందున ఊరికి గ్రామ పెద్దలు చెరి సగం సాగు చేసుకోవాలని తీర్మానం చేశారన్నారు. అప్పటినుండి సదరు భూమిని తాను సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. 2019లో గ్రామ రి సర్వేలో ఈ భూమి ప్రభుత్వ భూమిగా నమోదయింది అన్నారు. దీంతో నాగి వెంకటేశ్వర్లు కోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. సదరు కేసు విచారణలో ఉందన్నారు. తాను సాగు చేసుకుంటున్న భూమిలో జామాయిల్ వేసి అమ్ముకోవడానికి ప్రయత్నిస్తే నాగి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు అడ్డుకున్నారని ఆరోపించారు. అలాగే నాగి వెంకటేశ్వర్ల తో పాటు తాను ఉమ్మడిగా 5 ఎకరాల ప్రభుత్వ స్థలంలో నిమ్మ తోట వేసుకుని ఉన్నామన్నారు. ఆ తోటలోనికి కూడా తనను రానీయకుండా అడ్డుకుంటున్నారని వాపోయాడు. ఈ విషయాలపై స్థానిక జలదంకి పోలీస్ స్టేషన్లో ఇరువురు ఫిర్యాదులు చేసుకున్నామన్నారు. తన పొలము ఎలాగైనా లాక్కోవాలని నాగి వెంకటేశ్వర్లు అతని కుటుంబ సభ్యులు గురువారం సాయంత్రం తనపై విచక్షణారహితంగా దాడులు చేసి గాయపరిచారని తెలిపారు. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని బాధిత రైతు కాసుమహేశ్వరరావు కోరుతున్నాడు.



# సీఎం చంద్రబాబు మార్గదర్శకంలో సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ







సూళ్లూరుపేట, పెన్ పవర్, ఏప్రిల్ 10 రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకంలో సూళ్లూరుపేటను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం ఆమె నియోజకవర్గంలోని తడ మండలంలో విస్తృతంగా పర్యటించారు.తడ మండలంలోని కారు గ్రామంలో 36 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న విలేజ్ క్లినిక్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.అలాగే తడకండ్రికలో రెండు సచివాలయ భవనాలు,విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు సేవా కేంద్రాలను ప్రారంభించారు. తడ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్ వ్యవస్థను ప్రారంభించిన అనంతరం స్వచ్ఛ రథాలను జండా ఊపి ప్రారంభించారు.తడలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే 9 మంది లబ్ధిదారులకు 4,53,614 రూపాయల చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలో 15 హెల్త్ విలేజ్ క్లినిక్లు మంజూరైనట్లు తెలిపారు వాటి నిర్మాణాలను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యం అందించేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్ లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం,పలువురు కూటమి పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం జలదంకి ఎంపీడీవో శ్రీధర్ బాబు

కావలి ఆర్ సి ఇంచార్జ్ పెన్ పవర్ ఏప్రిల్ 10 స్వచ్ఛతతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, పరిశుభ్రత అనేది అభివృద్ధికి మూలమని, స్వచ్ఛత ఉంటేనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని జలదంకి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్. శ్రీధర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బ్రాహ్మణక్రాక పంచాయతీలో స్వచ్ఛ రథం ద్వారా నిర్వహిస్తున్న పనితీరును డిప్యూటీ ఎంపీడీవో యు. లాలపరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నీరజ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఇంటి నుంచి మొదలై వీధి, గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్రం వరకు పరిశుభ్రతను పాటించినప్పుడే దేశం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. చెత్త ద్వారా సంపదను సృష్టించవచ్చనే అవగాహన ప్రజల్లో కల్పించడమే స్వచ్ఛ రథం ప్రధాన




ఉద్దేశమని తెలిపారు. ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంగా పనిచేస్తూ స్వచ్ఛ ఆంధ్ర-- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రతి పౌరుడు స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వామిగా మారి తన వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

# పౌష్టికాహారం తోనే పిల్లల సరైన ఎదుగుదల

పలమనేరు,పెన్ పవర్, ఏప్రిల్ 10, పౌష్టికాహారం తోనే పిల్లల సరైన ఎదుగుదల సాధ్యమని ఐసిడిఎస్ సూపర్ వైజర్ సునీత అన్నారు.గంగవరం మండలం పత్తికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం పోషణ పక్వడ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ..శిశువు జన్మించిన రోజు నుండి మొదటి ఆరు సంవత్సరాలలో పిల్లల మెదడు పూర్తి స్థాయిలో ఎలా అభివృద్ధి చెందుతుందో తెలుసుకోవాలని అన్నారు.అలాగే వెయ్యి రోజుల సంరక్షణ ప్రాముఖ్యత గురించి, పౌష్టికాహారాన్ని మన ఇంట్లోనే ఎలా తయారు చేసుకోవాలి అనే విషయాలు తెలిపారు. ప్యాక్ చేసిన ఆహారాల వలన కలిగే నష్టాలు, ముఖ్యంగా స్త్రీలు మరియు పిల్లలు వాటికి దూరంగా ఉండాల్సిన అవసరం గురించి వివరించారు.ప్రతి ఇంట్లో చక్కెర వినియోగాన్ని తగ్గించాలని సూచించారు.చక్కెర అధికంగా వాడటం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలను కూడా వివరించారు. అలాగే పిల్లలపై మొబైల్ ఫోన్లు,టీవీ స్క్రీన్ ప్రభావం గురించి చర్చిస్తూ,ప్రతి తల్లి ఈ అలవాట్లను తగ్గించాలని సూచించారు.




ఈ కార్యక్రమంలో వైద్యులు మల్లికార్జునరెడ్డి, షార్ధజ్,అంగన్వాడీ కార్యకర్త మంజుభార్గవి,ఆశా వర్కర్లు, గర్భవతులు, బాలింతలు మరియు చిన్నారులు పాల్గొన్నారు.

# గాంధీనగర్ లో మౌలిక వసతులు కల్పించండి : టిడిపి ఇన్చార్జి ముక్కా కు వినతి

రైల్వేకోడూరు (తిరుపతి) : పెన్ పవర్,ఏప్రిల్ 10: రైల్వే కోడూరు మండలం రెడ్డివారిపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని చిట్వేల్ రోడ్డు అనుకొని ఉన్న గాంధీ నగర్ తూర్పు భాగంలో నివసించే ప్రజలకు మౌలిక వసతులైన త్రాగునీరు,సిమెంట్ రోడ్లు,వీధిలైట్లు ఏర్పాటు చేయాలంటూ శుక్రవారం టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో గాంధీనగర్ ప్రజలు టిడిపి ఇన్చార్జ్,కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి కి వినతిపత్రం అందజేశారు.సిమెంటు రోడ్లు, వీధిలైట్లు,త్రాగునీటి బోరు వేయాలంటూ ఇదివరకే రెండు మూడు పర్యాయాలు ఎంపీడీవో,తాసిల్దారులకు వినతి పత్రాలు అందజేశామని కానీ ఇప్పటివరకు ఎలాంటి పనులు చేపట్టలేదని కనీసం టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపానందరెడ్డి చొరవ తీసుకొని మాకు ఈ మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని గాంధీనగర్ ప్రజలు కోరుతున్నారు.



# త్వరలోనే 7వ వార్డు లో డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం చైర్ పర్సన్ సుప్రజా

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఏప్రిల్ 10. బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీలోని ఏడో వార్డు ఖాజా నగర్ జమీల హాల్ వీధిలో త్వరలోనే డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతాయని మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి తెలియజేశారు.... ధ్వంసమైన డ్రైనేజీ మరియు అమృత్ 2.ఓ పథకం కింద పైప్ లైన్ ఏర్పాటుకు రోడ్లను గుంతల మయం చేసి పూడ్చలేదని అక్కడ స్థానికంగా ఉండే ప్రజలు చైర్ పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆ విషయాన్ని సంబంధిత అధికారులతో మాట్లాడి ఆ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు..స్థానికంగా ఉండే ప్రజల నుండి సమస్యలను అడిగి తెలుసుకుని, ఆ సమస్యలు అన్నీ కూడా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆ సమస్యలను పరిష్కరిస్తామని, ఎమ్మెల్యే సహాయ సహకారాలతో బుచ్చిరెడ్డిపాలెం పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతామని, తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటేష్,టిడిపి పట్టణ



ఆర్గనైజర్ సెక్రటరీ సుభహాని స్థానిక టిడిపి నాయకులు అక్తర్, హనీఫ్ పాల్గొన్నారు...

# పెన్నా బ్యారేజ్ లో దూకిన గుర్తు తెలియని వ్యక్తి..





నెల్లూరు పెన్ పవర్ ఏప్రిల్ 10. పోలీసులకు సమాచారం అందించిన స్థానికులు.. ఘటనా స్థలాన్ని పరిశీలించి గాలిస్తున్న పోలీసులు.. నెల్లూరు పెన్నా బ్యారేజ్ లో గుర్తు తెలియని వ్యక్తి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బైకు చెప్పులు బ్యారేజ్ సమీపంలో ఉంచి బ్యారేజ్ లోకి దూకాడనే స్థానికులు చెబుతున్నారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహం లభ్యం కాలేదు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

# మూడు ప్రయివేట్ పాఠశాలల బస్సులు దగ్ధం

కమలాపురం పెన్ పవర్,ఏప్రిల్ 10: మండలంలోని కోగటం గ్రామంలో గురువారం అర్ధరాత్రి వేర్వేరు ప్రయివేట్ పాఠశాలలకు చెందిన మూడు బస్సులు దగ్ధమయ్యాయి. ప్రొద్దుటూరు లోని పలు ప్రయివేట్ పాఠశాలలకు చెందిన బస్సులను కోగటం గ్రామంలోని ఓ ఖాళీ ప్రదేశంలో ప్రతి రోజూ నిలిపి ఉంచుతారు. బుధవారం మధ్యాహ్నం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులను ఆయా గ్రామాల్లో దింపి వచ్చిన తర్వాత బస్సులను యధావిధిగా కోగటం గ్రామంలో పార్కింగ్ చేశారు. ఈ క్రమంలోనే అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి వేర్వేరు పాఠశాలలకు చెందిన మూడు బస్సులు దగ్ధమయ్యాయి. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న వారు మంటలను అదుపు చేశారు. ఆకతాయిలెవరైనా బస్సులకు నిప్పు పెట్టారా లేదా షార్ట్‌సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పాఠశాలలకు చెందిన యాజమాన్యాల ఫిర్యాదు మేరకు కమలాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# ప్రేమోన్మాది ఘాతుకం

ఖాజీపేట. పెన్ పవర్,ఏప్రిల్ 10: ఓ ప్రేమోన్మాది ఘాతుకానికి పాల్పడ్డాడు. తనను ప్రేమించలేదని ఓ విద్యార్థిని గొంతుకోసి అతి కిరాతంగా హత్య చేశాడు. ఈ సంఘటన కడప జిల్లా ఖాజీ పేటలో సంచలనంగా మారింది. మృతురాలి ఇంటికి వెళ్లి ఎవరూ లేని సమయంలో దుర్మార్గుడు దారుణానికి ఒడిగట్టాడు. నిందితుడి ఉరి తీయాలని ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్తులు, మృతురాలి బంధువులు జాతీయ రహదారిపై బైఠాయించారు. పట్టణంలో ఐదు గంటల పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నిందితుడిని పోలీసులు వెనకేస్తున్నారని బాధితుల ఆరోపిస్తున్నారు. స్థానికులు, బంధువుల కథనం మేరకు.. ఖాజీపేటలోని అగ్రహారం గ్రామానికి చెందిన కీర్తన(17) పట్టణంలో ఏపి మోడల్ స్కూల్‌లో సెకండ్ ఇయర్ ఇంటర్ చదువుతుంది. మండలంలోని ఆంజనేయకొట్టాల గ్రామానికి చెందిన ఆవుల వెంకటేష్ ఓ ప్రయివేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. వీరు కొంత కాలం నుంచి వీరిద్దరూ చనువుగా ఉండేవారన్నారు. ఇటీవల కీర్తనకు ఇంట్లో వారు వివాహ ప్రయత్నం చేస్తున్నారు. ఈ విషయం జీర్ణించుకోలేని ఆవుల వెంకటేష్ అగ్రహారం గ్రామంలో ఉన్న కీర్తన ఇంటికి వెళ్లి ఎవరూ లేని సమయంలో ఆమెను కొట్టి వెంట తెచ్చుకున్న కత్తితో అతి కిరాతంగా కత్తితో పొడిచాడు. సమాచారం అందుకున్న కీర్తన తండ్రి శ్రీనివాసులు పొలం వద్ద నుంచి ఇంటి చేరుకుని కొన ఊపిరితో కొట్టుమిట్టా డుతున్న కూతురిని తన భుజంపై పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచనల మేరకు కడప రిమ్స్ తరలి స్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. అఘాయిత్యానికి పాల్పడిన నింది తుడు పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున బస్టాండ్ కూడలిలోకి చేరుకొని రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. అంతటితో ఆగక కడప కర్నూల్ హైవే పైకి వచ్చి వాహనాలను అడ్డగిం చారు. దాదాపు 5 కిలోమీటర్ల మేర వాహ నాలు నిలిచిపోయాయి. ఉద్రిక్తంగా మారిన ఆందోళన మైదుకూరు డిఎస్పి రాజేంద్ర, పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకొని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆ సమయంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నిందితుడిని ఉరితీయాలంటూ కుటుంబ సభ్యులు ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మరికొందరు మాత్రం ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎన్‌కౌంటర్ చేయాలన్నారు. ఒకానొక దశలో సహనం కోల్పోయిన బాధిత కుటుంబ సభ్యులు జాతీయ రహదారిపై టైర్లుకు నిప్పు పెట్టారు. జిల్లా నుంచి పోలీసు ఉన్నత అధికారులు వచ్చి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఒకానొక దశలో జనాలను చెదరగొట్టేందుకు లాఠీఛార్జీ ప్రయత్నం చేశారు. నిందితుడిని విచారణ నిమిత్తం మైదుకూరు పోలీస్ స్టేషన్‌కు తరలించగా అక్కడ నుంచి ప్రొద్దుటూరుకు తరలించే ప్రయత్నం పోలీసులు చేశారు. పోలీసులు నిందితుడికి సహకరిస్తున్నారని కొందరు తీవ్ర ఆరోపణలు గుప్పించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపడు తున్నారు. వెంకటేష్‌ని వెంటనే శిక్షించాలి : ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఖాజీపేట మండలం అగ్రహారంలో విద్యార్థిని కీర్తనను హత్య చేసిన కిరాతకుడిని వెంటనే శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జ్వాల సుమంత్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ పేర్కొన్నారు. విద్యార్థినిని ఇంటిలో ఎవరూ లేని సమయంలో లోపలికి చొరబడి గొంతు కోసి కిరాతకంగా హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇటీవల జిల్లాలో దారుణ హత్యలు చోటు చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని వాపోయారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి : ఐద్వా అగ్రహారంలో కీర్తన అనే విద్యార్థిని గొంతు కోసి చంపిన వెంకటేష్ నిందితుని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ముంతాజ్ అన్నారు. రాష్ట్రంలో హోంమంత్రి మహిళా అయి ఉండి కూడా మహిళలపైనా, విద్యార్థినులపైనా ఇటీవల కాలంలో దాడులు



అధికమయ్యాయని పేర్కొ న్నారు. మహిళా చట్టాలు అమలులో లేవని అన్నారు. ఇప్పటికైనా మహిళలు, విద్యార్థుల మీద జరుగుతున్న దాడులు ఆపాలన్నారు. ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షిస్తాం : మంత్రి ఖాజీపేటలో విద్యార్థిని బలిగొన్న ప్రేమోన్మాది ఘాతుకంపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. నిందితుడు ఎంతటివాడైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు, బాలికలపై పట్ల ఉన్మాదిలా వ్యవహరిస్తే ఉక్కుపాదంతో అణిచివేస్తామన్నారు. పెళ్లి చేసుకోవాలంటూ, యువతి ఇంటికి వెళ్లి గొంతు కోయడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. విచక్షణ మరిచి, ఎంతో భవిష్యత్తు కలిగిన యువతిని బలి కొనడం దారుణమన్నారు. భవిష్యత్తులో మరెవరూ మహిళలు, బాలికల వైపు కన్నెత్తు చూడకుండా ఉండేలా చట్టపరంగా నిందితుడిని శిక్షిస్తామన్నారు మృతురాలి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం : ఎమ్మెల్యే ఖాజీపేట అగ్రహారంలో విద్యార్థిని కీర్తనపై జరిగిన దారుణ హత్య సంఘటనపై ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థిని ఇలాంటి క్రూరమైన ఘటనకు బలి అవ్వడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. మృతురాలి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతురాలి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. నిందితుడికి తగిన శిక్ష పడే వరకు ఈ విషయాన్ని సమీక్షిస్తూ ఉంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# జీఎస్టీ ఇన్స్పెక్టర్ గా ఎంపికైన సందీప్ కు అభినందనల వెల్లువ

నార్పల : పెన్ పవర్,ఏప్రిల్ 10: మండల కేంద్రమైన నార్పలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులైన గవ్వల శ్రీనివాసులు, అరుణ దంపతుల రెండవ కుమారుడు సందీప్ జాతీయ స్థాయిలోఎస్ఎస్ సి సిజిఎల్ పరీక్షల్లో 319 ర్యాంకు సాధించి కేంద్ర జీఎస్టీ ఇన్స్పెక్టర్గ గా ఎంపిక అయ్యాడు. కృషితో నాస్తి దుర్భిక్షమని కష్టపడితే ఏదైనా సాధించవచ్చని పోటీ పరీక్షలకు కష్టపడి చదివే పలువురు యువతకు సందీప్ ఆదర్శంగా నిలిచాడు. ఒక ప్రణాళికాబద్ధంగా సమయాన్ని కేటాయించుకొని చదివితే చక్కటి ఫలితాలు ఉంటాయని అన్నారు. తాను ఈ విజయం సాధించడంలో తన తల్లిదండ్రులైన శ్రీనివాసులు అరుణ ల ప్రోత్సాహం ఎంతో ఉందని కష్టపడి విజయం సాధించడం అన్నది తన తల్లిదండ్రులని చూసి నేర్చుకున్నానని తన తల్లి గారైన అరుణ 10 సంవత్సరాల విద్యా విరామం తర్వాత ఉపాధ్యాయ శిక్షణా కోర్సు పూర్తి చేసి కష్టపడి చదివి ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా ఎంపికైందని విద్యాపరంగా తన తండ్రి శ్రీనివాసులు ప్రోత్సాహం ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు అని అన్నారు. శుక్రవారం సాయంత్రం పలువురు స్థానికులు నాయక కమిటీ సభ్యులు మండల ప్రజలు సందీప్ ను ఆయన ఇంటిలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనం ఏదైతే చెట్టు అదే అవుతుందని గొప్ప విజయం సాధించిన సందీప్ కు పలువురు అధికారులు, మండల ప్రజలు,



ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు అదేవిధంగా సందీప్ స్ఫూర్తితో మండలానికి చెందిన మరింత మంది యువకులు మరిన్ని గొప్ప గొప్ప విజయాలు సాధించి నార్పల మండలానికి గొప్ప పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గతంలో గ్రూప్ వన్ ఫలితాలలో డిఎస్పీ ఉద్యోగం సాధించిన అశోక్ కుమార్ అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు నరేష్ జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్ బాబు నార్పలకు చెందినవారే కావడం గర్వకారణం...

# విద్యార్థులు సెలవులు సమయంలో జాగ్రత్తలు పాటించాలి

## జలదంకి ఎస్సై సయ్యద్ లతీఫున్నిసా

కావలి ఆర్సి ఇంచార్జ్ పెన్ పవర్ ఏప్రిల్ 10 పాఠశాలలకు ఒంటి పూట బడులు ప్రకటించిన సందర్భంగా విద్యార్థులు ఆనందోత్సవాలతో చుట్టుపక్కల ఉండే కుంటలు, చెరువుల వద్దకు వెళ్లవద్దని జలదంకి ఎస్సై సయ్యద్ లతీఫున్నిసా సూచించారు. శుక్రవారం ఆమె జలదంకి పోలీస్ స్టేషన్లో మీడియాతో మాట్లాడారు. స్నేహితుల ప్రోద్భలంతో ఈతకు వెళ్లడం లాంటివి చేసి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని చెరువులు, కుంటల వద్దకు ఎటువంటి రక్షణ సదుపాయాలు లేకుండా వెళ్ళనీయవద్దన్నారు. మండల ప్రజలు గ్రామాల్లో ఎవరైనా శుభకార్యాలకు, విహారయాత్రలకు వెళ్లినప్పుడు ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు. నగదు జాగ్రత్తగా ఉంచుకోవాలని తెలిపారు. ఇతర గ్రామాలకు వెళ్లినప్పుడు సమాచారం పోలీసులకు అందించాలన్నారు. వేసవిలో ఇంటికి తాళం వేసి బిల్డింగ్ పైన పడుకుంటే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. దొంగతనాల నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగానే రాత్రి వేళల్లో సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ ముమ్మరం చేసినట్లు పేర్కొన్నారు.



మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. బెట్టింగులు, మత్తు పదార్థాలు తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# గాంధీనగర్ లో మౌలిక వసతులు కల్పించండి : టిడిపి ఇన్చార్జి ముక్కా కు వినతి

రైల్వేకోడూరు (తిరుపతి) : పెన్ పవర్,ఏప్రిల్ 10: రైల్వే కోడూరు మండలం రెడ్డివారిపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని చిట్వేల్ రోడ్డు అనుకొని ఉన్న గాంధీ నగర్ తూర్పు భాగంలో నివసించే ప్రజలకు మౌలిక వసతులైన త్రాగునీరు, సిమెంట్ రోడ్లు,వీధిలైట్లు ఏర్పాటు చేయాలంటూ శుక్రవారం టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో గాంధీనగర్ ప్రజలు టిడిపి ఇన్చార్జ్,కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి కి వినతిపత్రం అందజేశారు. సిమెంటు రోడ్లు, వీధిలైట్లు,త్రాగునీటి బోరు వేయాలంటూ ఇదివరకే రెండు మూడు పర్యాయాలు



ఎంపీడీవో,తాసిల్దారులకు వినతి పత్రాలు అందజేశామని కానీ ఇప్పటివరకు ఎలాంటి పనులు చేపట్టలేదని కనీసం టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపానందరెడ్డి చొరవ తీసుకొని మాకు ఈ మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని గాంధీనగర్ ప్రజలు కోరుతున్నారు.

# ఎదురెదురుగా ఢీకొన్న బైకులు -- యువకుడు మృతి

చంద్రగిరి (తిరుపతి) : పెన్ పవర్,ఏప్రిల్ 10: ఎదురెదురుగా బైకులు ఢీకొట్టుకోవడంతో యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం తిరుపతి జిల్లా చంద్రగిరిలో జరిగింది. చంద్రగిరి మండలం, మల్లాయపల్లె వద్ద రాత్రి రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇందిరమ్మ కాలనీకి చెందిన నవీన్ కుమార్ (25) అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రుడిని వెంటనే రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో నవీన్ ఈ ఉదయం



మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# క్రమ శిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలి : ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమార స్వామి గుప్తా

వేంపల్లె (కడప) : పెన్ పవర్,ఏప్రిల్ 10:ఆర్జీయుాకేటీ యూనివర్సిటీలో చదివే విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ లు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్ లో 2026 గేట్ పరీక్షలో ప్రతిభ చాటి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మెమెంటోలను పంపిణీ చేసే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ ఇడుపులపాయి ట్రిపుల్ ఐటీ క్యాంపస్ లో విద్యాభ్యాసం చేస్తున్న 155 మంది విద్యార్థులు గేట్ లో పరీక్షల్లో రాణించడం సంతోషకరమని అన్నారు. టాప్ 1000 ర్యాంకుల్లో ఆర్కేవ్యాలీకి ట్రిపుల్ ఐటీకి చెందిన 36 మంది విద్యార్థులే ఉన్నట్లు చెప్పారు. ఉన్నత విద్య లక్ష్యంతోనే ఆర్జీయూకేటీలో విద్యా బోధన చేస్తున్నట్లు తెలిపారు. ఆర్జీయూకేటీలో ఇంటర్ నుండి ఇంజనీరింగ్ వరకు విద్యా బోధన చేయడం జరుగుతుందని చెప్పారు. విద్యార్థులు కష్టపడి చదవడం ద్వారానే వారికి ఫలితం దక్కిందని చెప్పారు. వచ్చే ఏడాదిలో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు గేట్ లో మరిన్ని మంచి ర్యాంకులు సాధించేందుకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. గ్రామీణా ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులే ఎక్కువ మంది ఆర్జీయుాకేటీ యూనివర్సిటీలోని ట్రిపుల్ ఐటీలో విద్యాభ్యాసం చేస్తున్నట్లు తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ కూడ అందుబాటులో ఉందని చెప్పారు.



క్వాంటం టెక్నాలజీ పై దఅష్టి పెట్టాలని నైపుణ్యం అనేది ప్రతి విద్యార్థిలో ఉండాలని కోరారు. విద్యార్థులు తమ భవిష్యత్ బంగారు భవిష్యత్తు ఉండే విధంగా క్రమ శిక్షణతో నడుచు కోవాలని కోరారు. ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగ అవకాశాలు పొందాలని కోరారు. క్యాంపస్ లో ఆయా కంపెనీలు పెట్టే క్యాంపస్ ఇంటర్వ్యూలకు హజరై ఉద్యోగాలలో పొందాలని కోరారు. ఆర్జీయూకేటీ పరిధిలోని ఇతర క్యాంపస్ కంటే ఇడుపులపాయి క్యాంపస్ విద్యార్థులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించడంతో పాటు విద్యా బోధన లో కూడ రాజీ లేకుండా నాణ్యమైన బోధన చేస్తున్నట్లు తెలిపారు. ఇడుపులపాయి ట్రిపుల్ ఐటీ రిసోర్స్ కేంద్రంగా ఉండే విధంగా విద్యార్థులే తీర్చి దిద్దాలని కోరారు. గేట్ పరీక్షలో రాణించిన విద్యార్థులు అందరూ జూనియర్ విద్యార్థులకు గేట్ లో రాణించేందుకు మెళకువులు తెలియ జేయాలని కోరారు. కంప్యూటర్ సైన్స్ ద్వారా వచ్చే అవకాశాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంప్యూటర్ సైన్స్ చదివే విద్యార్థులు కూడ 70 మంది గేట్ పరీక్షలో మంచి ర్యాంకులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఇడుపులపాయి ట్రిపుల్ ఐటీలో చదివిన విద్యార్థులు క్యాట్ లో కూడ రాణించడం జరిగిందని తెలిపారు. 2026 ఆల్ ఇండియా గేట్ పరీక్షలో ప్రతిభ చూపి ట్రిపుల్ ఐటీకి మంచి పేరు ప్రఖ్యాతలు తేవడం జరిగిందని చెప్పారు. గేట్ పరీక్షలో రాణించేందుకు విద్యార్థులకు కావాల్సిన మెటీరియల్ ట్రిపుల్ ఐటీలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఏస్ ఆకాడమీ, సంకల్ప స్కీం ఫౌండేషన్ ద్వారా ఆల్ ఇండియా గేట్ లో రాణించేందుకు ఉచిత శిక్షణ విద్యార్థులకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండాదని చెప్పారు. అనంతరం ఆల్ ఇండియా గేట్ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు డైరెక్టర్ కుమార స్వామి గుప్తా మెమెంటోలను, సర్టిఫికేట్లును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ అధికారి రమేష్, సిఎస్ఈ హెఓడిలు డాక్టర్ రత్నకుమారి, డాక్టర్ కోనప్ప, డాక్టర్ భాస్కరయ్య, పిఆర్ ఓ తిరుపతి రెడ్డితో పాటు ట్రిపుల్ ఐటీ అద్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాదయాత్రల సాక్షిగా వర్డ్ వార్...

**కడప, ఏప్రిల్ 10, పెన్ పవర్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసి, సంక్షేమ రాజ్యానికి బాటలు వేసిన దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి చేపట్టిన చారిత్రాత్మక 'ప్రజాప్రస్థానం' పాదయాత్రకు నేటితో 23 ఏళ్లు పూర్తయ్యాయి. అయితే, ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన వారసులు, అన్నాచెల్లెళ్లు అయిన వైఎస్ జగన్, వైఎస్ షర్మిల మధ్య సోషల్ మీడియా వేదికగా సాగిన మాటల యుద్ధం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తండ్రి ఆశయాల వారసులం మేమంటే మేమని ఇద్దరూ క్లెయిమ్ చేసుకుంటున్నప్పటికీ, ఒకరిపై ఒకరు చేసుకున్న విమర్శలు శృతిమించాయి.మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ తన తండ్రి పాదయాత్రను గుర్తు చేసుకుంటూ భావోద్వేగపూరితమైన ట్వీట్ చేశారు. ఏప్రిల్ 9, 2003న ఎర్రటి ఎండలో ప్రజల కష్టాలు తెలుసుకోవడానికి వైఎస్సార్ వేసిన అడుగులు, రాష్ట్ర చరిత్రను తిరగరాశాయని ఆయన కొనియాడారు. "నేనున్నాను" అనే భరోసాతో ప్రజల గుండెల్లో వైఎస్సార్ నిలిచిపోయారని, ఆ పాదయాత్రే ఆయన్ను ముఖ్యమంత్రిని చేసిందని పేర్కొన్నారు.ముఖ్యంగా వైఎస్సార్ హయాంలో జరిగిన ఉచిత విద్యుత్ సంతకం, జలయజ్ఞం, పోలవరం ప్రాజెక్టు వేగం, విద్య, వైద్య రంగాల్లో వచ్చిన విప్లవాత్మక మార్పులను జగన్ గుర్తు చేశారు. తన తండ్రి వేసిన ఆ ముద్రను ఎవరూ చెరిపేయలేరని, అదే స్ఫూర్తితో తన ప్రయాణం కొనసాగుతుందని జగన్ స్పష్టం చేశారు. తండ్రి వారసత్వాన్ని తన సంక్షేమ పాలనతో ముందుకు తీసుకెళ్తున్నానని

ఆయన పరోక్షంగా ఈ ట్వీట్ ద్వారా సందేశాన్ని ఇచ్చారు.జగన్ ట్వీట్‌కు ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అత్యంత ఘాటుగా స్పందించారు. వైఎస్సార్ పాదయాత్రను ఒక కాంగ్రెస్ సైనికుడిగా, పీసీసీ అధ్యక్షుడిగా ప్రారంభించారన్న విషయాన్ని ఆమె ప్రధానంగా గుర్తు చేశారు. వైఎస్సార్ పేరును పార్టీలో పెట్టుకుని, ఆయన ఆశయాలకు విరుద్ధంగా జగన్ వ్యవహరిస్తున్నారని నేరుగా విమర్శించారు.లౌకికవాదానికి నిలువుటద్దంలా నిలిచిన వైఎస్సార్ ఎక్కడ? మతోన్మాద బీజేపీకి ఢిల్లీలో తలవంచి, రాష్ట్రంలో మౌనం వహిస్తున్న జగన్ ఎక్కడ? అని ఆమె ప్రశ్నించారు. వక్ఫ్ చట్టం, దళిత క్రైస్తవుల రిజర్వేషన్లు వంటి అంశాల్లో జగన్ వైఖరిని ఆమె తప్పుబట్టారు. జగన్ ఐదేళ్ల పాలనలో దళితులు, మహిళలు, మైనారిటీలపై దాడులు పెరిగాయని, ఇది వైఎస్సార్ ఆత్మ క్షోభించేలా ఉందని ఆరోపించారు. ఫాసిస్టు శక్తులకు, క్యాపిటలిస్టులకు జగన్ దాసోహమయ్యారని షర్మిల విమర్శించారు. వైఎస్సార్ ఆశయాలకు పూర్తి భిన్నంగా ఉంటూ ఆయనకు నివాళులు అర్పించడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. జగన్ ఇప్పుడు చేయాల్సింది పాదయాత్ర కాదని, ఆత్మవిమర్శన యాత్ర అని చురకలు అంటించారు.ఒకప్పుడు

అన్న కోసం ఉప ఎన్నికల్లో, పాదయాత్రలో అలుపెరగకుండా శ్రమించిన షర్మిల, నేడు అదే అన్నపై రాజకీయంగా యుద్ధం ప్రకటించడం వైఎస్సార్ అభిమానులను విస్మయానికి గురి చేస్తోంది. వైఎస్సార్ పాదయాత్ర వార్షికోత్సవం సాక్షిగా బయటపడ్డ ఈ విభేదాలు, కేవలం కుటుంబ కలహాలే కాక, సిద్ధాంతపరమైన పోరాటంగా కూడా మారుతున్నాయి. తండ్రి పేరును, పాదయాత్ర సెంటిమెంట్‌ను ఇద్దరూ వాడుకుంటున్నప్పటికీ, ప్రజలు ఎవరి వైపు మొగ్గు చూపుతారనేది ఆసక్తికరంగా మారింది. ఒకవైపు జగన్ తన తండ్రి సంక్షేమ పథకాలే తన ఆయుధాలని అంటుంటే, మరోవైపు వైఎస్సార్ అసలైన రాజకీయ వారసత్వం తనదేనని షర్మిల వాదిస్తున్నారు. మొత్తానికి వైఎస్సార్ పాదయాత్ర జ్ఞాపకం.. అన్నాచెల్లెళ్ల మధ్య ట్వీట్ల యుద్ధానికి వేదికైంది.




## శ్రీకాకుళం రోడ్ టు తిరుపతి డైరక్ట్ ట్రైన్స్

**శ్రీకాకుళం, ఏప్రిల్ 10 పెన్ పవర్:** శ్రీకాకుళం ప్రజలకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తీపికబురు చెప్పారు. శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా మొట్ట మొదటి రైలు అందుబాటులోకి రానుంది. రైల్వేశాఖ శ్రీకాకుళం రోడ్ టు తిరుపతి 17439/17440 హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్‌ను మంజూరు చేసింది. ఈనెల 13వ తేదీ నుంచి ఈ రైలు ప్రారంభంకానుంది. శ్రీకాకుళం రోడ్ నుంచి ప్రతి సోమవారం, తిరుపతి నుంచి ప్రతి ఆదివారం అందుబాటులో ఉంటుంది.శ్రీకాకుళం జిల్లావాసుల ఎన్నో ఏళ్ల కల నెరవేరింది.. తిరుపతికి నేరుగా మొదటి రెగ్యులర్ రైలు సర్వీసుకు గ్రీన్‌సిగ్నల్ వచ్చేసింది. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చొరవ తీసుకుని శ్రీకాకుళం నుంచి తిరుపతికి రైలు నడపాలని రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ని కోరారు. వెంటనే స్పందించిన రైల్వేమంత్రి ఈ ప్రతిపాదనలపై అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో రెగ్యులర్ రైలును మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈనెల 13 నుంచి శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ నుంచి తిరుపతికి రైలు నంబర్ 17439/40 హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభంకానుంది. ఈ హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం సాయంత్రం తిరుపతి నుంచి బయల్దేరుతుంది.. అలాగే ప్రతి సోమవారం శ్రీకాకుళం రోడ్డు నుంచి బయల్దేరుతుంది.శ్రీకాకుళం ప్రజల దీర్ఘకాలిక కోరిక నెరవేరిందంటూ కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. 75 ఏళ్ల జిల్లా చరిత్రలో తొలిసారిగా శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా రెగ్యులర్ రైలు సర్వీస్ ప్రారంభమవుతోందని తెలిపారు. హంసఫర్ ఎక్స్‌ప్రెస్ (17439/17440) ప్రతి ఆదివారం తిరుపతి నుంచి, ప్రతి సోమవారం శ్రీకాకుళం నుంచి అందుబాటులోకి వస్తుందన్నారు. ఏప్రిల్ 13న శ్రీకాకుళం రోడ్ స్టేషన్ నుంచి ఈ రైలును ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ రైలు సర్వీస్‌ను మంజూరు చేసిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో శ్రీకాకుళానికి మరికొన్ని రైలు సర్వీసులు వచ్చేలా కృషి చేస్తానన్నారు.శ్రీకాకుళం జిల్లావాసులు తిరుపతికి, తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లాలంటే భువనేశ్వర్ నుంచి వచ్చే రైళ్లపై ఆధారపడేవారు. విశాఖపట్నం వెళ్లి అక్కడి నుంచి ప్రారంభమయ్యే రైళ్లలో వెళ్లాంటే రద్దీ ఎక్కువగా ఉంటోంది. అందుకే ఎప్పటి నుంచో శ్రీకాకుళం టు తిరుపతి రైళ్లను నడపాలనే డిమాండ్ ఉంది. మొత్తానికి సిక్కోలు వాసుల కల నెరవేరింది.. ఈ నెల 13 నుంచి రైలు అందుబాటులోకి రానుంది. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా నుంచి తిరుమల శ్రీవారి దర్శనాల కోసం వెళ్లేవారికి ఈ రైలు ఎంతో ఉపయోగంగా ఉంటుందని చెబుతున్నారు. అంతేకాదు ఇటీవల శ్రీకాకుళం జిల్లాలోని పలు రైల్వే స్టేషన్‌లకు కొత్తగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేందుకు హాల్ట్ కల్పించిన సంగతి తెలిసిందే.

## చెవిరెడ్డికి జగన్ మధ్య ఏమైంది...



**తిరుపతి, ఏప్రిల్ 10, పెన్ పవర్:** నెల్లూరు పార్లమెంటు స్థానంలో వైసీపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డికి అవకాశం కల్పించనున్నట్టు తెలుస్తోంది. పార్టీమెంటు నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసే అంశంపై వైసీపీ అధినేత జగన్ పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో తన కుటుంబానికి అత్యంత విధేయుడిగా ఉన్న చెవిరెడ్డికి నెల్లూరు టికెట్ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. అయితే.. ఈ విషయంలో చెవిరెడ్డి విభేదిస్తున్నారని సమాచారం. తనకు అసెంబ్లీనియోజకవర్గం చాలని ఆయన కోరుతున్నట్టు తెలుస్తోంది. గత ఎన్నికల్లోనే తాను పొరపాటు చేశానని తరచుగా చెవిరెడ్డి చెబుతున్నారు. అప్పట్లో ఒంగోలు నియోజక వర్గం నుంచి ఎంపీగా పోటీ చేశారు. వాస్తవానికిపార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలు ఓటేయాలి. గత ఎన్నికలను గమనిస్తే.. వైసీపీ తరఫున పోటీ చేసిన నలుగురు మాత్రమే విజయం దక్కించుకున్నారు. ఈ నలుగురు స్థానికంగా ఉన్న నాయకులే. పొరుగు జిల్లాల నుంచి వచ్చిన వారికి ప్రజలు తిరుగోమనం బాట పట్టించారు చిత్తూరు జిల్లాకు చెందిన చెవిరెడ్డి ఒంగోలులో పోటీ చేయడంతో ఇదే పరిస్థితి ఏర్పడింది. ఒంగోలు ప్రజలు స్థానిక నాయకుడు మాగుంట శ్రీనివాసుల రెడ్డికే పెద్దపీట వేశారు. దీంతో చెవిరెడ్డి ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. ఇక, ఇప్పుడు కూడా ఆయనను నెల్లూరు జిల్లాకు బదిలీ చేయాలని భావిస్తుండడంతో ఆయన అధిష్టానంపై తొలిసారి ఆగ్రహంతో ఉన్నట్టు తెలుస్తోంది. కానీ.. పైకి చెప్పలేక.. పార్టీ అనుచరుల దగ్గర తన అభిప్రాయం వెల్లడిస్తున్నారు. తను సొంత జిల్లాలోనే ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నట్టు చెవిరెడ్డి అంటున్నారు. వాస్తవానికి చంద్రగిరి ఇవ్వాలని కోరుతున్నా.. కుమారుడు మోహిత్ కోసం.. దానిని వదులుకున్నారు. ఇక, జిల్లాలోని ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. ఒకవేళ నియోజకవర్గాలకు అవకాశం లేకపోతే.. తను పోటీ నుంచి తప్పుకొంటానని.. కేవలం ఇంచార్జ్‌గా మాత్రమే బాధ్యతలు చేపడతానని అంటున్నారు. ఈ పరిణామాల క్రమంలో ఇప్పుడు ఏం జరుగుతుందన్నది చూడాలి.

# రాజధాని రగడ..ఆగేదెలా

**గుంటూరు, ఏప్రిల్ 10, పెన్ పవర్:**



అమరావతికి ముందు ఓకే అన్నారు. ఆ తర్వాత మూడు రాజధానుల స్లోగన్ అందుకున్నారు. అది వర్కౌట్ కాలేదు. అంతటితో ఇష్యూ క్లోజ్ అయిందనుకుంటే.. మావిగన్ అంటూ కొత్త స్లోగన్ అందుకున్నారు వైసీపీ అధినేత జగన్. ఉత్తరాంధ్ర వైసీపీ నేతల వాదన అయితే ఇంకా డిఫరెంట్. అమరావతి పేరుతో ఒకే దగ్గర అభివృద్ధి చేస్తే ఎలా అని ధర్మాన..అమరావతికి వ్యతిరేకం కాదంటూనే..మావిగన్ ప్రతిపాదనలో తప్పేం లేదంటూ కవర్ డ్రైవ్ స్టార్ట్ చేశారు బొత్స.?=అధినేత నుంచి..పార్టీలో సీనియర్ లీడర్ వరకు ఒక్కొక్కరిది ఒక మాట. ఎవరి మాటల్లో క్లారిటీ లేదు. అంతా కన్‌ఫ్యూజన్. గజిబిజి గందరగోళం. అమరావతికి వ్యతిరేకం కాదంటారు. జగన్ సూచించిన మావిగన్ ప్రతిపాదనలో తప్పేం లేదంటారు. జగనేమో ప్లాన్-ఏ త్రీ క్యాపిటల్స్..ప్లాన్-బి మావిగన్ అంటారు. అమరావతి పేరుతో ఒకేచోట అభివృద్ధి చేస్తే ఎలా అని ప్రశ్నిస్తారు. ఉత్తరాంధ్ర పరిస్థితి ఏంటంటూ నిలదీస్తారు. దీంతో ఒక ప్రధాన రాజకీయ పార్టీగా వైసీపీ..ఏపీ రాజధాని విషయంలో స్పష్టంగా ఉండలేకపోతోందా అన్న చర్చ సాగుతోందివైసీపీలో ఉన్న అన్ని ప్రాంతాల నాయకులు రాజధానిపై ఒకే మాట మీద ఉంటున్నారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధినాయకుడు జగన్ ఈ నెల 1న ప్రెస్ మీట్ పెట్టి మరీ మావిగాన్ అని ఒక కొత్త ప్రతిపాదన చేశారు. దాని మీద వైసీపీలోనే డిఫరెంట్ ఒపీనియన్స్ ఉన్నాయా అన్న డౌట్స్ వ్యక్తం అవుతున్నాయి. ఉత్తరాంధ్రకు చెందిన సీనియర్ నేతలు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి.2014లో వైసీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు..అసెంబ్లీలో ఏపీ రాజధానిగా అమరావతి అని చర్చకు వచ్చినప్పుడు ఫ్యాన్ పార్టీ కూడా రైట్ రైట్ అనేసింది. ఆ తర్వాత 2019లో అధికారంలో వచ్చాక మూడు రాజధానులు అన్న నినాదం ఎత్తుకుంది. ఆ సమయంలో విశాఖలో పరిపాలనా రాజధాని పెడతామని చెప్పుకొచ్చింది. దాంతో ఉత్తరాంధ్ర వైసీపీ నేతల ఆ విషయాన్ని గొప్పగా చెప్పుకునే వారు. వెనకబడిన ఉత్తరాంధ్రకు రాజధానిని తీసుకుని వస్తున్నామని కూడా భారీ ప్రకటనలు ఇస్తుండే వారు. అయితే ఐదేళ్ల వైసీపీ పాలనలో విశాఖ నుంచి కీలక అడుగు పడింది లేదు. పైగా పరిపాలనా రాజధాని అన్నది పబ్లిక్‌కు అర్థమయ్యే నాటికి వైసీపీ ప్రభుత్వం దిగిపోయింది. మూడు రాజధానులు కూడా అటకెక్కాయని లేటెస్ట్‌గా జగన్ ఇచ్చిన మావిగన్ స్టేట్‌మెంట్‌తో తేలిపోయిందంటున్నారు కూటమి నేతలు.చంద్రబాబు అమరావతి పేరుతో అభివృద్ధి అంతా ఒకే చోట పెడుతున్నారని మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు విమర్శలు చేయడం ఇంకా ఇంట్రెస్టింగ్‌గా మారింది. అలా అయితే ఏపీలో ఇతర ప్రాంతాల అభివృద్ధి ఏం కావాలని ఆయన ప్రశ్నించారు. వెనుకబడిన ప్రాంతాల గురించి పట్టదా అని నిలదీశారు. అయితే జగన్ కూడా గుంటూరు, విజయవాడ మావిగన్ అంటూ క్యాపిటల్‌ను ప్రస్తావించారు. ఈ లెక్కన మావిగన్ ప్రతిపాదన రాజధాని కూడా గుంటూరు, విజయవాడ మధ్య అభివృద్ధి అంతా ఒకే చోట కేంద్రీకృతం కానుంది. దీంతో వైసీపీ నేతలు చెబుతున్న దానికి చేస్తున్న విమర్శలకు మావిగన్ ప్రపోజల్ కూడా టైంపాస్ ముచ్చటే అన్న టాక్ నడుస్తోంది.ఇక బొత్స సత్యనారాయణ లాంటి ఉత్తరాంధ్ర నేతలు అమరావతి రాజధానికి తాము వ్యతిరేకం కాదని అంటున్నారు. సేమ్‌టైమ్ జగన్ మావిగన్ ప్రతిపాదనలో తప్పేంటి అని సమర్థించుకుంటున్నారు. ఇక పక్క పక్క జిల్లాల్లో ఉన్న బొత్స కానీ ధర్మాన కానీ ఏపీ రాజధాని, ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వన్ లైన్ ఎజెండాతో ఉన్నారా అన్న చర్చ కూడా వస్తోంది. అమరావతికి బొత్స ఓకే అంటుంటే ధర్మాన వేరేలా మాట్లాడుతున్నారు. అధినాయకత్వం మావిగన్ అంటోంది. ఇలా తలో రకమైన అభిప్రాయం వ్యక్తం చేస్తుండటంతో..వైసీపీ తాను గందరగోళంలో చిక్కుకుని జనాలను కూడా కన్ఫ్యూజ్ చేస్తోందన్న టాక్ వినిపిస్తోంది.వైసీపీ నేతల డిఫరెంట్ టోన్‌కు కూటమి నేతల నుంచి ధీటుగానే ప్రతి విమర్శలు వస్తున్నాయి. విశాఖ రాజధాని ఏమైందో చెప్పాలని వారు కౌంటర్లు వేస్తున్నారు. మావిగన్ ప్రతిపాదన ధర్మానకు నచ్చిందా లేదా కూడా చెప్పాలని కోరుతున్నారు. మరోవైపు ఏపీ రాజధాని విషయంలో వైసీపీ నేతల మధ్య, ప్రాంతాల వారీగా ఆ పార్టీ లీడర్ల మధ్య ఒక ఏకాభిప్రాయం ఉందా లేదా అన్న డౌట్స్‌ను వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ తీరు ఇలాగే ఉంటే రాజధాని ఇష్యూనే గుదిబండగా మారి..రాబోయే రోజుల్లో పొలిటికల్‌గా అతిపెద్ద సవాల్‌గా మారే ప్రమాదం ఉంటుంది.

# 2029 వైసీపీ స్లోగన్స్ రెడీ

**విజయవాడ ఏప్రిల్ 10, పెన్ పవర్:**



ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని అమరావతి అంశం పొలిటికల్ హీట్ పెంచింది. అమరావతికి కేంద్రం చట్టబద్ధత కల్పించిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సరికొత్త ప్రతిపాదనల్ని తెరపైకి తెచ్చారు. మావిగన్ పేరుతో మచిలీపట్నం, విజయవాడ, గుంటూరును కలిపి కారిడార్‌గా ప్రకటిస్తే బావుటుందన్నారు. అమరావతికి కంటే తక్కువ ఖర్చుతో రాజధానిగా అభివృద్ధి చేయొచ్చన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ మావిగన్ పేరుతో కొత్త స్లోగన్‌ను అందుకుంది. రావాలి జగన్, కావాలి మావిగన్ అంటూ ఫ్లెక్సైలు వెలిశాయి.

2019 ఎన్నికలు అందరికి గుర్తున్నాయా.. వైఎస్సార్‌సీపీ 151 సీట్లలో ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. అయితే 2019 ఎన్నికల సమయంలో ఒక స్లోగన్ రాష్ట్ర మొత్తం మార్మోగింది.. అదే 'రావాలి జగన్, కావాలి జగన్'. వైఎస్సార్‌సీపీ ఈ నినాదాన్ని ప్రజల్లోకి బాగా తీసుకెళ్లింది. అంతేకాదు 'రావాలి జగన్, కావాలి జగన్' అంటూ ఓ పాటను కూడా విడుదల చేయగా.. ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. 2019 ఎన్నికలకు ఈ స్లోగన్ బాగా కలిసొచ్చింది.. జనాలను ఆకట్టుకుంది. ఇప్పుడు కూడా అదే తరహాలో మరో కొత్త స్లోగన్ తెరపైకి వచ్చింది.. రాష్ట్రంలో ఫ్లెక్సీలు కూడా ఏర్పాటవుతున్నాయి.వైఎస్సార్‌సీపీ.. రావాలి జ'గన్'..కావాలి మావి'గన్' అంటూ కొత్త స్లోగన్‌ను మొదలు పెట్టింది. ఆ పార్టీ నేత కారుమూరు వెంకటరెడ్డి పేరుతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయగా.. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'మన మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు.. ఆంధ్రప్రదేశ్ బాగుండాలి అంటే.. త్వరగా అభివృద్ధి చెందాలి అంటే.. మావిగన్ రాజధాని కారిడార్ అవ్వాలి.. అది జగనన్నతోనే సాధ్యం. మన రాజధాని మావిగిన్.. మావిగన్ ఆంధ్రప్రదేశ్‌కు గ్రోత్ ఇంజన్' అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీ చివర్లో.. అంతేకాదు లక్షల కోట్ల అప్పులు తీసుకురాకుండా అతి తక్కువ ఖర్చుతో 60 లక్షల జనాభాతో రెడీమేడ్ రాజధాని మావిగన్ అని రాశారు. కొందరు నెటిజన్లు ఈ ఫ్లెక్సీలను పోస్ట్ చేస్తున్నారు.

ఈ ఫ్లెక్సీల్లో మావిగన్ ప్రాముఖ్యతను వివరించారు. మచిలీపట్నానికి మున్సిపల్ కార్పొరేషన్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ౘ ఆస్పత్రి, సముద్రం, పోర్టు, రైల్వేస్టేషన్ వంటి సౌకర్యాలు ఉన్నాయని ప్రస్తావించారు. విజయవాడకు మున్సిపల్ కార్పొరేషన్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, కృష్ణానది, ఎయిర్‌పోర్ట్, రైల్వే జంక్షన్, అతిపెద్ద బస్ స్టేషన్, వ్యాపార వాణిజ్య కేంద్రం ఉన్నాయన్నారు. తాడేపల్లి ౘ మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్, ఎయిమ్స్ ఆస్పత్రి, జాతీయ రహదారులు ఉన్నాయన్నారు. అలాగే గుంటూరులో మున్సిపల్ కార్పొరేషన్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, అతిపెద్ద మార్కెట్ యార్డ్, రైల్వే జంక్షన్, బస్ స్టేషన్, వ్యాపార వాణిజ్య కేంద్రం ఉందన్నారు. 2019లో సక్సెస్ అయిన రావాలి జగన్, కావాలి జగన్ స్లోగన్‌కు లింక్ చేస్తూ ఇప్పుడు రావాలి జ'గన్'..కావాలి మావి'గన్' అంటూ కొత్త నినాదాన్ని తెరపైకి తచ్చారు. మరి 2019లో హిట్ అయిన ఈ నినాదం 2029 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి కలిసొస్తుందా, లేదా అన్నది చూడాలి.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమరావతిపై లక్షల కోట్లు ఖర్చు చేయడం కంటే.. మచిలీపట్నం, విజయవాడ, మచిలీపట్నాన్ని కలిపి మావిగన్ పేరుతో 110 కిలోమీటర్ల కారిడార్‌గా ప్రకటించాలనే కొత్త ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చారు. అమరావతికి ఖర్చు చేసే నిధుల్లో కేవలం 10శాతం ఖర్చు చేస్తే అద్భుతమైన గ్రోత్ ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు మావిగన్ ప్రతిపాదనకు మద్దతుగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు

## చెన్నై సూపర్ కింగ్స్ సరైనా ప్లేయర్స్‌ని తీసుకోలే..

# CSKపై మాజీ క్రికెటర్ ఫైర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన జట్టుగా పేరుగాంచిన చెన్నై సూపర్ కింగ్స్, ప్రస్తుతం గడ్డు పరిస్థితులని ఎదుర్కొంటోంది. 2025 సీజన్‌లో పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచిన సీఎస్కే. ప్రస్తుత 2026 సీజన్‌లో కూడా ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయి హ్యాట్రిక్ పరాజయాలను మూటగట్టుకుంది. దీంతో జట్టు ఎంపిక, వేలంలో తీసుకున్న నిర్ణయాలపై మాజీ క్రికెటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ చేసిన విమర్శలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి.

**ధరకు తగ్గ ప్రదర్శన ఎక్కడ?:**

మినీ వేలంలో ప్రశాంత్ వీర్, కార్తిక్ శర్మ అనే ఇద్దరు ప్లేయర్స్ కోసం చెన్నై సూపర్ కింగ్స్ ఏకంగా ఒక్కొక్కరికి రూ. 14 కోట్లకు పైగా ఖర్చు చేసింది. అయితే, ఇప్పటి వరకు వారు ఆడిన తీరు చూస్తుంటే అంత భారీ ధర పెట్టడం అవసరమా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని బద్రీనాథ్ అన్నారు. ఎవరో ఇచ్చిన సలహాలు విని అంత డబ్బు ధారపోశారు, కానీ క్షేత్రస్థాయిలో వారి ప్రదర్శన మాత్రం నిరాశాజనకంగా ఉందని విమర్శించారు.

**స్కౌటింగ్ వైఫల్యంపై విమర్శలు:**

ప్రతిభ గల ఆటగాళ్లను గుర్తించడంలో సీఎస్కే ఇతర జట్ల కంటే వెనుకబడి ఉందని సుబ్రమణ్యం బద్రీనాథ్ తెలిపారు. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు కోసం హేమంగ్ బదానీ, వేణుగోపాల్ రావు లాంటి వారు ప్రపంచవ్యాప్తంగా ఉన్న లీగ్‌లను గమనిస్తూ ఆటగాళ్లను వెలికితీస్తారని కొనియాడారు. ముంబై ఇండియన్స్ జట్టుకు జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా లాంటి దిగ్గజాలు దొరకడానికి కారణం వారి స్కౌట్ జాన్ రైట్.. సీఎస్కేకు అటువంటి పటిష్టమైన స్కౌటింగ్ వ్యవస్థ లేకపోవడం మైనస్ అని వెల్లడించారు.

**శనివారం ఢిల్లీతో కీలక పోరు**

వరుస ఓటములతో కుంగిపోయిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టు, తమ తదుపరి మ్యాచ్‌లో భాగంగా శనివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లోనైనా గెలిచి ఫామ్‌లోకి రావాలని అభిమానులు కోరుకుంటున్నారు. అయితే బద్రీనాథ్ చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే, జట్టులో సమూల మార్పులు జరిగితే తప్ప సీఎస్కేకి పూర్వ వైభవం రాదని స్పష్టమవుతోంది.

## నీవు నా కొడుకు కెరీర్ ముగించేశావు: క్రిస్ బ్రాడ్ ఆవేదన.. యువీ రియాక్షన్!

**హైదరాబాద్ పెన్ పవర్:** 2007 టీ20 ప్రపంచకప్‌లో యువరాజ్ సింగ్ ఒకే ఓవర్లో ఆరు సిక్సర్ల విధ్వంసం క్రికెట్ చరిత్రలో ఒక అద్భుతం. అయితే ఆ ఘటన తర్వాత మైదానం వెలుపల జరిగిన కొన్ని ఆసక్తికరమైన విషయాలను యువీ ఇటీవల 'ది ఓవర్ లాప్' షోలో పంచుకున్నాడు. ఆ సిక్సర్ల వర్షం స్టువర్ట్ బ్రాడ్ కెరీర్‌పై ఎలాంటి ప్రభావం చూపిందో, అతని తండ్రి క్రిస్ బ్రాడ్ ఎలా స్పందించారో యువీ వివరించాడు. ఆ మ్యాచ్‌కు రిఫరీగా ఉన్న స్టువర్ట్ బ్రాడ్ తండ్రి క్రిస్ బ్రాడ్ మ్యాచ్ ముగిశాక యువరాజ్ వద్దకు వచ్చి, "నువ్వు దాదాపు నా కొడుకు కెరీర్‌ను ముగించేశావు" అని అన్నారట. ఒక తండ్రిగా తన కొడుకు పడుతున్న బాధను ఆయన అలా వ్యక్తం చేశారు. దానికి యువీ స్పందిస్తూ.. "సర్, గతంలో నా బౌలింగ్‌లో కూడా ఐదు సిక్సర్లు పడ్డాయి, ఆ బాధ నాకు తెలుసు" అని ఆయనను ఓదార్చే ప్రయత్నం చేశాడు. ఆ తర్వాత క్రిస్ బ్రాడ్ కోరిక మేరకు ఒక జెర్సీపై యువీ సంతకం చేస్తూ.. "నువ్వు భవిష్యత్తులో ప్రపంచంలోనే అత్యుత్తమ బౌలర్‌గా ఎదుగుతావని ఆశిస్తున్నాను" అని రాసిచ్చాడు.

అయితే, ఆ జెర్సీని స్టువర్ట్ బ్రాడ్ కోపంతో డస్ట్‌బిన్‌లో పడేశాడని యువీకి ఇటీవల తెలిసింది. "అంతటి అవమానం జరిగినప్పుడు ఆ కోపం రావడం సహజమే, అది తప్పు కాదు" అని యువీ చాలా పరిణతితో స్పందించాడు. ఆ ఎదురుదెబ్బతో కుంగిపోకుండా బ్రాడ్ 600 పైగా టెస్ట్ వికెట్లు తీసి లెజెండరీ బౌలర్‌గా ఎదగడం గొప్ప విషయమని యువీ కొనియాడాడు.



## పంత్ భాయ్ చెప్పాడు.. నేను కొట్టాను: లక్నో హీరో ముకుల్ చౌదరి



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్‌లో ప్రతిభకు కొదవ లేదు. కానీ సరైన అవకాశం, మార్గదర్శకత్వం లభించినప్పుడే యువ ఆటగాళ్లు సంచలనాలు సృష్టిస్తారు. లక్నో సూపర్‌జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) యువ బ్యాటర్ ముకుల్ చౌదరి విషయంలో ఇదే జరిగింది. గురువారం ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)తో జరిగిన మ్యాచ్‌లో 22 ఏళ్ల ముకుల్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో తన జట్టుకు ఒంటిచేత్తో విజయాన్ని అందించాడు. 182 పరుగుల లక్ష్య ఛేదనలో లక్నో కష్టాల్లో ఉన్నప్పుడు క్రీజులోకి వచ్చిన ముకుల్, కేకేఆర్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. అవేశ్ ఖాన్‌తో కలిసి 54 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. ఇందులో విశేషమేమిటంటే, అవేశ్ ఖాన్ కేవలం ఒక పరుగు మాత్రమే చేయగా, మిగిలిన 52 పరుగులు ముకుల్ బాదడం విశేషం. చివరి బంతికి బౌండరీ కొట్టి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. మ్యాచ్ అనంతరం ముకుల్ మాట్లాడుతూ తన ప్రదర్శన వెనుక కెప్టెన్ రిషబ్ పంత్ ఇచ్చిన సలహా ఉందని వెల్లడించాడు. "గతంలో మ్యాచ్‌లను ముగించడానికి చాలా తొందరపడేవాడిని. కానీ ఇప్పుడు ప్రశాంతంగా ఉండటంపై దృష్టి పెట్టాను. ఆటను చివరి వరకు తీసుకెళ్తే గెలిపించగలనని నమ్ముతున్నా" అని తెలిపాడు. "గత మ్యాచ్‌లో సరిగా టైమింగ్ చేయలేకపోయాను. దాంతో రిషబ్ భాయ్‌తో మాట్లాడాను. 'నువ్వు అతిగా ఆలోచిస్తున్నావు. నీ పనిపై దృష్టి పెట్టు. బంతిని చూసి ఆడు. నీపై నాకు నమ్మకం ఉంది. నీపై నీకు కూడా నమ్మకం ఉండాలి' అని చెప్పాడు. ఆ మాటలు నాలో ఆత్మవిశ్వాసం నింపాయి" అని ముకుల్ వివరించాడు. పంత్ ఇచ్చిన భరోసాతోనే ఎలాంటి ఒత్తిడి లేకుండా తన సహజమైన ఆట ఆడి జట్టును గెలిపించగలిగానని ముకుల్ పేర్కొన్నాడు.

## బ్లూ జీన్స్‌లో ఈషా గ్లామర్ టచ్.. నెట్టింట ట్రెండ్



తెలుగు చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వరంగల్ చిన్నది ఈషా రెబ్బా, తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలతో నెటిజన్ల మనసు దోచుకుంటోంది. బ్లూ అండ్ బ్లూ జీన్స్ లుక్‌లో ఆమె కనిపిస్తున్న తీరు ఎంతో స్టైలిష్‌గా, అదే సమయంలో చాలా సింపుల్‌గా ఉంది. కస్సుమనే చూపులతో, డిఫరెంట్ స్టిల్స్‌లో ఈషా పంచుకున్న ఈ ఫోటోలు ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అవుతూ ట్రెండింగ్‌లో నిలిచాయి. సంప్రదాయ దుస్తుల్లోనే కాకుండా, ఇలాంటి వెస్ట్రన్ వేర్‌లో కూడా ఆమె గ్లామర్ అదిరిపోయిందని ఫ్యాన్స్ కామెంట్లతో ముంచెత్తుతున్నారు.

**డెనిమ్ లుక్‌లో ఈషా మెరుపులు:**

తాజా ఫోటో షూట్‌లో ఈషా రెబ్బా పూర్తి డెనిమ్ లుక్‌లో దర్శనమిచ్చింది. బ్లూ కలర్ జీన్స్ షర్ట్, దానికి తగ్గట్టుగా జీన్స్ ప్యాంటు ధరించి ఒక నేచురల్ లుక్‌ను సొంతం చేసుకుంది. ఫోటోలో ఆమె కింద కూర్చుని, ఒక చేత్తో ఎల్లో కలర్ 'మినియన్' మగ్‌ను పట్టుకుని, మరో చేతిని తలకు ఆనించి సీరియస్ లుక్ ఇస్తున్న తీరు చాలా ఆకర్షణీయంగా ఉంది. ఇక ఎలాంటి ఆడంబరాలు లేకుండా చాలా సింపుల్‌గా కనిపిస్తూనే, తన కళ్ళతో నెటిజన్లను మెస్మరైజ్ చేస్తోంది. ఈ 'డబుల్ డెనిమ్' ట్రెండ్ ఈషాకు పర్ఫెక్ట్‌గా సెట్ అయిందని చెప్పవచ్చు.



**తెలుగమ్మాయి ప్రయాణం.. సినిమాల సందడి:**

ఇక లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ సినిమాతో కెరీర్ మొదలుపెట్టిన ఈషా, అంతకు ముందు ఆ తర్వాత చిత్రంతో హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకుంది. తెలుగమ్మాయి కావడంతో మొదట్లో కొన్ని ఇబ్బందులు ఎదురైనా, తన నటనతో ఒక్కో మెట్టు ఎక్కుతూ వచ్చింది. అమీ తుమీ, బందిపోటు వంటి సినిమాల్లో తన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకుంది. ఇక నాని నిర్మించిన అ సినిమాతో పాటు, ఎన్టీఆర్-త్రివిక్రమ్ కాంబోలో వచ్చిన 'అరవింద సమేత'లో ఒక కీలక పాత్రలో నటించి స్టార్ హీరోల సినిమాల్లోనూ తన సత్తా చాటింది. ప్రస్తుతం ఆమె బాలీవుడ్ ఎంట్రీకి కూడా సిద్ధమవుతోంది.

**సోషల్ మీడియాలో భారీ ఫాలోయింగ్:**

ఈషా రెబ్బా సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటుంది. షూటింగ్ విశేషాలతో పాటు తన వ్యక్తిగత ఫోటోలను కూడా ఎప్పటికప్పుడు ఫ్యాన్స్‌తో పంచుకుంటుంది. హీరోయిన్‌గానే కాకుండా, సెకండ్ హీరోయిన్‌గా కూడా వైవిధ్యమైన పాత్రలు చేస్తూ విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. ఇక రీసెంట్ గా 'మామా మశ్చీంద్ర', 'ఓం శాంతి శాంతి శాంతిః' వంటి మూవీ లతో అలరించిన ఈ భామ, కేవలం తెలుగుకే పరిమితం కాకుండా తమిళ్, మలయాళ భాషల్లో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. అందుకే ఆమెకు దక్షిణాది అంతటా ఫాలోయింగ్ పెరుగుతోంది.



**స్టార్ ఇమేజ్ దిశగా అడుగులు:**

ప్రస్తుతం ఈషా రెబ్బా పంచుకున్న ఈ బ్లూ జీన్స్ పిక్స్ ఆమె గ్లామర్ రేంజ్‌ను మరోసారి చాటిచెప్పాయి. ఫోటోలో ఆమె కూర్చున్న భంగిమ, ఆ ఎల్లో మగ్ కాంబినేషన్ నెటిజన్లను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. చిన్న సినిమాల నుంచి మొదలై ఈరోజు పాన్ ఇండియా స్థాయికి ఎదిగేందుకు ఈషా చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయం. గ్లామర్ ప్లస్ టాలెంట్ ఉన్న ఈ వరంగల్ బ్యూటీ, త్వరలోనే బాలీవుడ్ లోనూ జెండా పాతాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఈషా ఇలాంటి మరిన్ని విభిన్నమైన ఫోటోషూట్‌లతో అభిమానులను అలరించాలని ఆశిద్దాం.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D. No. 41-1/5-1, Srinivasa Tower, Flat No. S2, Gowthami Nagar, Krishnalanka, Vijayawada, NTR Dist. editor GANTYADA APPARAO. PRGI Registration No. " APTEL/25/A4561" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965